





Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 277 | బుధవారం 22 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# చర్చలకు నో : ఇరాన్

- ఒప్పందం కుదరకపోతే బాంబు దాడులే : ట్రంప్ బెదిరింపు
- ఎలాంటి చర్చలకైనా సిద్ధం : ఇరాన్
- నేటితో ముగియనున్న కాల్పుల విరమణ ఒప్పందం
- నేడు ఇస్లామాబాద్‌కు అమెరికా, ఇరాన్ బృందాలు : పాకిస్తాన్

టెహ్రాన్, వాషింగ్టన్ - సూర్య వాస్తవం

కాల్పుల విరమణ ఒప్పందం మరికొన్ని గంటల్లో ముగియబోతున్న నేపథ్యంలో ఇరాన్, అమెరికా మధ్య పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరగాల్సిన శాంతి చర్చలపై అనిశ్చితి కొనసాగుతోంది. అమెరికాతో రెండో విడత చర్చలు జరిపే ప్రశ్నే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. అమెరికా డిమాండ్ల చిట్టా పెరిగిపోతోందని, అవాస్తవ అంచనాలు వేస్తోందని, వైఖరిని తరచూ మార్చుకుంటోందని, పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తోందని మండిపడింది. హోర్ముజ్ జలసంధిని దిగ్బంధించడం ద్వారా కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించిందని ఆరోపించింది. చర్చల నిమిత్తం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఇస్లామాబాద్ చేరుకున్నప్పటికీ ఇరాన్ వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదు. తాజా పరిణామాల నేపథ్యంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించే అవకాశాలు కూడా సన్నగిల్లుతున్నాయి. ఇదిలావుండగా పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇరాన్ అధ్యక్షుడు మసూద్

- మిగతా 2లో..






# ప్రధాని మోడీ యూరప్ పర్యటన..!

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన తర్వాత, తొలిసారిగా ప్రధాని నరేంద్రమోడీ యూరప్ పర్యటనకు వెళ్లబోతున్నారని తెలుస్తోంది. వచ్చే నెలలో 4 యూరప్ దేశాల్లో ప్రధాని పర్యటన ఉండబోతోంది. నార్వే, స్వీడన్, నెదర్లాండ్స్, ఇటలీలో ఆయన పర్యటించనున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. నార్వేలో జరిగే

- మిగతా 2లో..

## త్రిసూర్ బాణాసంచా పరిశ్రమలో

# భారీ పేలుడు

- 13 మంది సజీవదహనం
- 30 మందికి తీవ్రగాయాలు.. పలువురి పరిస్థితి విషమం
- సీఎం పినరయి విజయన్ తీవ్ర దిగ్భ్రాంతి
- సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం
- క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలి : మంత్రి వీణా జార్జ్



త్రిసూర్ - సూర్య వాస్తవం

కేరళ రాష్ట్రంలోని త్రిసూర్‌లోగల ఓ బాణా సంచా పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 13 మంది సజీవ దహనమయ్యారు. 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. పూరం వేడుక కోసం ముండతికోడ్‌లో నిల్వ ఉంచిన బాణాసంచా కేంద్రాల్లో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ కేంద్రాన్ని స్థానికంగా ఉన్న పంటపొలాల్లో

- మిగతా 2లో..



## ప్రధాని మోడీపై సభాహక్కుల

# ఉల్లంఘన నోటీస్

- లోక్‌సభకు ప్రివిలేజ్ నోటీసు ఇచ్చిన కాంగ్రెస్
- ఎంపీ కే సీ వేణుగోపాల్

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

ప్రధాని మోడీ సభాహక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్లు కాంగ్రెస్ ఎంపీ కే సీ వేణుగోపాల్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రూల్ 222 కింద ప్రివిలేజ్ నోటీసు అందజేశారు. "ఏప్రిల్ 18న దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోడీ చేసిన ప్రసంగంలో ప్రతిపక్షాలను తప్పుబట్టారు. 131వ రాజ్యాంగ

- మిగతా 2లో..

## అక్రమాలపై

# న్యాయ పోరాటం చేద్దాం

- మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

పులివెందుల- సూర్య వాస్తవం



అధికార పార్టీ నాయకుల ఆక్రమాలపై న్యాయపోరాటం చేద్దామని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బెంగళూరు నుంచి పులివెందులకు చేరుకున్న ఆయనకు

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ఎన్డీయేతోనే తమిళనాడుకు

# పూర్వ వైభవం

- తమిళనాడులో చంద్రబాబు ఎన్నికల ప్రచారం
- చెన్నైలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి మీడియా సమావేశం
- డీలిమిటేషన్‌పై డీఎంకే, కాంగ్రెస్ తీరును ఎండగట్టిన చంద్రబాబు
- మహిళా రిజర్వేషన్లను అడ్డుకుని దక్షిణాదికి నష్టం చేశారని ఆవేదన
- మాతృభాషను గౌరవిద్దాం.. ఇతర భాషలపై ద్వేషం వద్దని హితవు

చెన్నై- సూర్య వాస్తవం

అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగాల కల్పన జరగాలంటే అది ఒక్క ఎన్డీఏతోనే సాధ్యమని, తమిళనాడు రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకురాగల శక్తి ఎన్డీఏ కూటమికి ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నాడు చెన్నైలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

- మిగతా 2లో..





## అనకాపల్లిలో

# రీన్యూ భారీ సోలార్ ప్లాంట్....

- ఈ నెల 23న శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
- రూ. 5,400 కోట్ల పెట్టుబడితో ఇంగోట్-వేఫర్ తయారీ కేంద్రం
- ఈ ప్రాజెక్టు ద్వారా 2,100 మందికి పైగా ఉపాధి అవకాశాలు
- ఏపీలో మొత్తం రూ. 82,000 కోట్ల పెట్టుబడుల దిశగా రీన్యూ సంస్థ

2లో



## క్రైస్తవుల సంక్షేమానికి

# రూ.88.55 కోట్లు మంజూరు

- 6 నెలల్లో రూ.40.94 కోట్లు ఖర్చు

హైదరాబాద్- సూర్య వాస్తవం

క్రైస్తవుల సంక్షేమానికి కేటాయించిన నిధులను ఖర్చు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ కనబరుస్తోంది. రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ నేతృత్వంలో 6 నెలల్లో వివిధ సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించిన నిధుల్లో దాదాపు సగం నిధులను ఖర్చు చేసినట్టు అధికారులు తెలిపారు. గతంలో మాదిరిగా కేటాయింపులకే పరిమితం కాకుండా కచ్చితంగా ఆ వర్గం సంక్షేమం కోసం వాటిని

- మిగతా 2లో..

## ప్రధాని మోడీపైసభాహక్కుల
# ఉల్లంఘన నోటీస్

(మొదటిపేజీ తరువాయి)
¬సవరణ బిల్లు ప్రతిపక్షాల వల్లే వీగిపోయిందని, దీనివల్లే మహిళా రిజర్వేషన్ బిల్లుకు క్లియరెన్స్ దక్కలేదని ఆరోపించారు" అని ప్రధాని ప్రసంగాన్ని కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీ వేణుగోపాల్ తప్పుబట్టారు. మోడీ తన ప్రసంగంలో ప్రతిపక్షాలను తప్పుపట్టడం అనైతికమని, అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు అవుతుందని అన్నారు.

బిల్లు వీగిపోవడానికి కారణం ప్రతిపక్షాలు అని చెప్పడం సభాహక్కుల ఉల్లంఘన అవుతుందని కాంగ్రెస్ నేత పేర్కొన్నారు. పార్లమెంట్‌లో మెజారిటీ సాధించకపోవడానికి ప్రతిపక్షాలు కారణమని ప్రధాని పేర్కొనడం శోచనీయమన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయని, కానీ ప్రభుత్వం తెచ్చిన డీలిమిటేషన్ బిల్లును మాత్రమే వ్యతిరేకించాయని వేణుగోపాల్ తెలిపారు. 106వ రాజ్యాంగ సవరణతో ఏర్పడిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని ప్రతిపక్షాలు కోరాయని, ప్రధాని మాత్రం విపక్షాలను తప్పుబట్టి సభాహక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని అన్నారు. పార్లమెంట్ విధుల ప్రకారం తాము ఓటింగ్‌లో పాల్గొన్నామని, కానీ ఆ బిల్లు ఓడిపోవడానికి ప్రతిపక్షాలే కారణమని ప్రభుత్వం చెప్పడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందని, రాజ్యాంగంలోని 105వ అధికరణ ప్రకారం ఓటు వేసిన సభ్యులకు ఎటువంటి కారణాలను ఆపాదించరాదని ఆయన అన్నారు. ప్రధానితో సహా ఎవరికైనా ఆ ఆర్టికల్ వర్తిస్తుందని తెలిపారు. ఎన్నికైన ప్రతినిధి తన విధులను నిర్వర్తిస్తుంటే .. వారిని తప్పుపట్టడం వ్యక్తిగత దాడి అవుతుందని, అంతేకాక పార్లమెంట్ వ్యవస్థను ధిక్కరించడం అవుతుందని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసినట్టు అవుతుందని ఆయన తన నోటీసులో పేర్కొన్నారు. పార్లమెంట్, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు స్పీకర్ ఓం బిర్లా చర్యలు తీసుకోవాలని కోరారు.

## త్రిసూర్ బాణాసంచా పరిశ్రమలో
# భారీ పేలుడు

(మొదటిపేజీ తరువాయి)
తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్‌లలో ఏర్పాటు చేశారు. పేలుడు సంభవించిన వెంటనే అప్రమత్తమైన స్థానికులు, అధికారులు గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలోనూ బాణాసంచా నిల్వ కేంద్రాలు ఉండటం, వరుసగా పేలుళ్లు జరగడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడిందని రెస్క్యూ బందాలు వెల్లడించాయి. ఈ ఘటనకు అధిక ఉష్ణోగ్రతలు కూడా ఓ కారణం కావచ్చని అనుమానం వ్యక్తం చేశాయి.అయితే ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎంతమంది కార్మికులు ఉన్నారనే విషయంపై స్పష్టత లేకపోయినప్పటికీ.. వారి కోసం తెప్పించిన ఆహార ప్యాకెట్ల ఆధారంగా దాదాపు 40 మంది ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. ఈ ఘటనపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ అధికారులను ఆదేశించారు. ఈ దుర్ఘటనపై స్పందించిన ప్రధాని మోడీ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ప్రధాని మోడీ
# యూరప్ పర్యటన..!

(మొదటిపేజీ తరువాయి)
భారత్–నార్డిక్ సదస్సుకు ప్రధాని మోడీ హాజరవ్వనున్నారు. ఈ అధికారిక పర్యటన మే 15 నుంచి 20 వరకు జరిగే అవకాశం ఉంది. ముందుగా నార్వేలో పర్యటించిన తర్వాత స్వీడన్, నెదర్లాండ్స్, ఇటలీలను సందర్శించనున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ యుద్ధం, హోర్ముజ్ జలసంధి ఉద్రిక్తతలు మధ్య మోడీ యూరప్ పర్యటన ఉండబోతోంది. ఈయూ–భారత్ ఒప్పందం కుదిరిన ఒప్పందాన్ని "మదర్ ఆఫ్ ఆల్ డీల్స్"గా అభివర్ణిస్తున్నారు. ఈ ఒప్పందం వల్ల భారత్, యూరోపియన్ దేశాల వాణిజ్యం మరింత పెరుగనుంది. ఈ ట్రేడ్ డీల్ కుదిరిన తర్వాత తొలిసారిగా మోడీ యూరప్ పర్యటనకు వెళ్తున్నారు.

## క్రైస్తవుల సంక్షేమానికి
# రూ.88.55 కోట్లు మంజూరు

(మొదటిపేజీ తరువాయి)
వెచ్చించాలని మంత్రి ఆదేశించిన నేపథ్యంలో 6 నెలల్లో ఈ నిధులను ఖర్చు చేశారు. క్రైస్తవుల సంక్షేమానికి గతేడాది రూ.88.55 కోట్లు కేటాయించగా, ఆరు మాసాల్లో రూ.40.94 కోట్లను ఖర్చు చేశారు. చర్చిల అభివృద్ధి, క్రిస్మస్ వేడుకలు, యువతకు ఉపాధి, మహిళా సాధికారత, శిక్షణ, మౌలిక వసతుల అభివృద్ధి వంటి పలు రకాల కార్యక్రమాలు, పథకాల కోసం ఈ నిధులు విడుదలైన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు, విందు కార్యక్రమాల కోసం రూ.33 కోట్లను విడుదల చేశారు. దీంతో రాష్ట్రంలో క్రిస్మస్ సందర్భంగా4,249 చర్చిలకు వైట్‌వాషింగ్, లైటింగ్ కోసం రూ.12.75 కోట్లు మంజూరునిచ్చారు. జీహెచ్‌ఎంసీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో 400 కేంద్రాల్లో క్రిస్మస్ విందు కార్యక్రమాలను నిర్వహించారు. 5 వేల మంది నిరుద్యోగ క్రైస్తవ యువతకు స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం పథకంలో దాదాపు 4,980 ఆన్‌లైన్ దరఖాస్తులు అందాయి. 1,465 మంది యువతకు ప్లేస్‌మెంట్ ఆధారిత ఉపాధి శిక్షణ కోసం 2.68 కోట్లు మంజూరు చేశారు. ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద క్రైస్తవ మహిళలకు ఉచిత కుట్టు యంత్రాలు ఇవ్వాలని నిర్ణయించి అందులో 824 మంజూరు చేయగా 685 యంత్రాలు అందజేశారు. చర్చిల నిర్మాణం, మరమ్మతుల కోసం సహాయాన్ని కొనసాగిస్తున్నారు. 169 సంక్షేమ ప్రతిపాదనలు సిద్ధం చేసి పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు 13.18 కోట్లను వెచ్చిం చనున్నారు. 14 కొత్త చర్చి నిర్మాణ ప్రతిపాదనలు రూ.17.02 కోట్లతో ఆమోదం పొందాయి. 10 ప్రాంతాల్లో 42.21 ఎకరాల ప్రభుత్వ భూమి క్రైస్తవ సమాధి స్థలాలకు కేటాయించారు. వాటి అభివృద్ధి పనులకు రూ.3.62 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. క్రైస్తవ భవన్‌కు రూ.10 కోట్లు మంజూరు. ఉప్పల్‌లో కొనసాగుతున్న నిర్మాణ పనులకు రూ.3.50 కోట్లను విడుదల చేశారు. రూ.69 కోట్లతో ఇంటిగ్రేటెడ్ క్రైస్తవ కాంప్లెక్స్‌ను ప్రతిపాదించారు.

# చర్చలకు నో : ఇరాన్

(మొదటిపేజీ తరువాయి)
పెజెష్కియాన్‌కు ఫోన్ చేసి మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితిపై చర్చించారు. సౌదీ అరేబియా, ఖతార్, టర్కీ దేశాలతో జరిపిన సంప్రదింపుల వివరాలు తెలియజేశారు.

**ప్రతినిధి బృందాన్ని పంపడం లేదు : టెహ్రాన్**

చైనాకు టెహ్రాన్ ప్రతినిధి బృందాన్ని పంపుతోందంటూ వస్తున్న వార్తలను ఇరాన్ తోసిపుచ్చింది. అధికారికంగా కానీ, అనధికారికంగా కానీ ఇప్పటి వరకూ ఏ ప్రతినిధి బృందం ఇస్లామాబాద్ బయలుదేరలేదని ప్రభుత్వ మీడియా తెలియజేసింది. రెండో విడత చర్చల కోసం ఇరాన్ ప్రతినిధి బృందం ఇస్లామాబాద్ చేరుకున్నదని లేదా బయలుదేరిందని పలు అంతర్జాతీయ, ప్రాంతీయ వార్తాసంస్థలు కథనాలు అంది స్తుండడంతో ఇరాన్ ఈ వివరణ ఇచ్చింది. ఒత్తిడితో చర్చలు జరపలేమని ఇరాన్ అధికా రులు స్పష్టం చేశారు. అమెరికా వైఖరిలో వచ్చే మార్పును బట్టే చర్చలు కొనసాగుతా యని తేల్చిచెప్పారు. కాగా కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సందర్భంగా ఇచ్చిన హామీ లను అమెరికా ఉల్లంఘిస్తే తమ సాయుధ దళాలు సహించబోవని, అత్యంత అప్రమత్తత తో ఉంటాయని, 'నిర్ణయాత్మక... తక్షణ' స్పందన తెలుపుతాయని ఇరాన్ సీనియర్ సైనిక కమాండర్ మేజర్ జనరల్ అబ్దోల్లహీ హెచ్చరించారు.

**బెదిరింపులతో చర్చలా : ఘలీబఫ్ మండిపాటు**

బెదిరింపులు, కాల్పుల విరమణ ఒప్పం దం ఉల్లంఘనల ద్వారా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దౌత్యాన్ని నీరుకారుస్తున్నారని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘలీబఫ్ ఆరోపించారు. చర్చలను లొంగుబాటుకు వేదికగా మార్చేందుకు ట్రంప్ ప్రయత్నిస్తు న్నా రని మండిపడ్డారు. ఉద్రిక్తతలు మరింత పెరి గితే యుద్ధభూమిలో మరిన్ని అస్త్రాలు వాడతా మని హెచ్చరించారు. బెదిరింపులకు పాల్పడు తున్న ట్రంప్‌తో చర్చలు ఎలా సాధ్యమని ప్రశ్నిం చారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లం ఘించడమే కాకుండా తమ నౌకల రాకపోక లను అడ్డుకుంటున్నారని ధ్వజ మెత్తారు. లొంగిపోయేలా తమపై ఒత్తిడి తేవడానికి, యుద్ధం తిరిగి మొదలు పెట్టడానికి ఆయన చర్చలను ఓ సాకుగా చూపుతున్నారన్నారు. బెదిరింపుల మధ్య జరిగే చర్చలను ఇరాన్ ఎప్పటికీ అంగీకరించదని చెప్పారు.

**చర్చలకు రాకుంటే సమస్యలు తప్పవు : ట్రంప్ బెదిరింపు**

'చర్చలకు రండి...లేకుంటే గతంలో ఎన్నడూ చూడని విధంగా సమ స్యలు ఎదుర్కోండి' అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను బెదిరిం చారు. 'ది జాన్ ఫ్రెడరిక్స్ షో'కు ఆయన ఫోన్ ఇంటర్వ్యూ ఇస్తూ చర్చలకు ఇరాన్ వస్తే మంచిదే నని, లేకుంటే గతంలో ఎన్నడూ లేని విధంగా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఇరాన్ నాయకత్వంతో నేరుగా చర్చలు జరిపేందుకు తాను సిద్ధమేనని ట్రంప్ తెలిపారు. చర్చలు జరిపేందుకు తమ వద్ద సమర్థులైన వ్యక్తులు ఉన్నారని, ఒకవేళ ఇరాన్ ప్రతినిధులు తనను నేరుగా కలవాలని అనుకున్నా అభ్యంతరం లేదని చెప్పారు. ఇదిలావుండగా సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో వరుసగా పోస్టులు పెడు తున్న ట్రంప్ తాజాగా మరో ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. ఇరాన్‌కు చెందిన వందలాది చమురు నౌకలు అమెరికా వైపు వస్తున్నాయని దాని సారాంశం. అమెరికాకు బయలు దేరాలని ఇరాన్ నాయకత్వమే నౌకలకు సూచించిందని, అవి టెక్సాస్, లూసియానా, అలస్కా నగరాలకు చేరుకునే అవకాశం ఉన్నదని ఆయన రాసుకొచ్చారు. యుద్ధంపై తప్పుడు వార్తలు రాస్తున్నా యంటూ కొన్ని అమెరికా వార్తా సంస్థలపై ట్రంప్ మండిపడ్డారు. అమెరికా సైనిక కార్యకలాపాలు బాగానే కొనసాగుతున్నా యంటూ దళా లను ప్రశం సించారు. ఇరాన్‌తో ఒప్పందం కుదిరే వరకూ నౌకల రాక పోకలపై దిగ్బంధం కొనసాగు తుందని ట్రంప్ చెప్పారు.

**శాంతి చర్చలకు సిద్ధంకండి : చైనా సూచన**

తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం గడువు బుధవారం ముగుస్తున్న దృష్ట్యా అన్ని పక్షాలు శాంతి చర్చలకు సిద్ధం కావాలని చైనా సూచించింది. 'ప్రస్తుత పరిస్థితి కీలక దశలో ఉంది. అది శాంతి, యుద్ధం మధ్య ఊగిస లాడుతోంది. ఈ తరుణంలో అన్ని పక్షాలు చిత్తశు ద్ధిని ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. రాజకీయ పరిష్కారానికి కట్టుబడి ఉండాలి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించి చర్చలు కొనసాగించాలి' అని చైనా విదేశాంగ ప్రతినిధి గుయో జియాకన్ తెలిపారు. హోర్ముజ్ జలసంధిని తెరవాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇప్పటికే సూచించారు.

**దిగ్బంధాన్ని తప్పించుకొని...**

హోర్ముజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకల రాకపోకలపై అమెరికా దిగ్బంధాన్ని విధించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆ ఆంక్షలను దాటుకొని ఇరాన్‌కు చెందిన ఓ ట్యాంకర్ తిరిగి తమ జలాలలో ప్రవేశించిం దని తెలుస్తోంది. ఇరాన్ నుంచి ఇండోనేషియాకు గత నెలలో 20 లక్షల బ్యారళ్ల చమురుతో ఓ నౌక బయలుదేరింది. చమురును మరో ట్యాంకర్‌లోకి బదిలీ చేసిన తర్వాత తిరిగి వెనక్కి బయలు దేరింది. అమెరికా దిగ్బంధాన్ని దాటుకొని విజయవం తంగా ఇరాన్ జలాల్లోకి ప్రవేశించింది. ఇది ఒక గొప్ప విజయమని ఇరాన్ తెలిపింది. అయితే ఈ ఘటనపై అమెరికా ఇంకా స్పందించలేదు.

## ఎన్డీయేతోనే తమిళనాడుకు
# పూర్వ వైభవం

(మొదటిపేజీ తరువాయి)
ముఖచిత్రం మారనుందని నిపుణులు భావిస్తున్నారు.

ఈ సందర్భంగా డీఎంకే, కాంగ్రెస్ పార్టీల వైఖరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తమిళనాడు ప్రస్తుత రాజకీయ పరిస్థితుల వల్ల రాష్ట్రం ఎలా నష్టపోతుందో వివరించారు.

**రాహుల్, స్టాలిన్ దీని ద్వారా ఏం సాధించారు?**

మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లుల విషయంలో డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేశాయని చంద్రబాబు ఆరోపించారు. "మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రాన్ని ఓడించామని డీఎంకే, కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ వంటి పార్టీలు భావిస్తున్నాయి. కానీ వాస్తవానికి వారు ఈ దేశ మహిళలను, దక్షిణాది రాష్ట్రాలను ఓడించారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రస్తుతం ఉన్న సీట్లకు అదనంగా 50 శాతం పెంచాలనేది కేంద్రం ప్రతిపాదన. ఆ పెరిగిన సీట్లలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయి. దీనివల్ల దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు. ఈ ఫార్ములా కంటే మెరుగైనది మరొకటి ఉంటుందా? అయినా, కేవలం రాజకీయ కారణాలతో ఈ రెండు బిల్లులను అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ, స్టాలిన్ దీని ద్వారా ఏం సాధించారు?" అని చంద్రబాబు ప్రశ్నించారు. "సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేను దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా ఎందుకు ఆలోచిస్తాను? నేను దక్షిణాది వైపే మాట్లాడుతున్నాను. 2001లో వాజ్‌పేయి హయాంలో జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ ప్రతిపాదన వస్తే, అది దక్షిణాదికి నష్టమని చెప్పి నేనే ఆపించాను. ఈ విషయాన్ని ఇండియా కూటమి పార్టీలు గుర్తుంచుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు.

**తమిళనాడుకు గత వైభవమేదీ?**

ఒకప్పుడు దక్షిణ భారతదేశానికే కేంద్రంగా ఉన్న చెన్నై, ఇప్పుడు హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతో పోటీ పడలేకపోతోందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. "తమిళనాడులో అభివృద్ధి ఆగిపోయింది. శాంతిభద్రతలు క్షీణించాయి. మహిళలపై నేరాలు, కస్టోడియల్ మరణాలు, డ్రగ్స్ వాడకం పెరిగిపోయాయి. గతంలో తమిళనాడుకు గొప్ప చరిత్ర ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి ఉందా? జరిగిన కొద్దిపాటి అభివృద్ధి కూడా కేంద్ర నిధుల వల్లే. చెన్నై రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, చెన్నై–బెంగళూరు–అమరావతి హైస్పీడ్ రైలు కారిడార్ వంటివి కేంద్రం చొరవే. డీఎంకే లాంటి పార్టీల వల్ల రాష్ట్రం వెనుకబడుతోంది" అని విమర్శించారు.

**ఇప్పుడు ఏపీని చూడండి**

కేంద్ర సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఎలా అభివృద్ధి పథంలో పయనిస్తోందో చంద్రబాబు వివరించారు. "దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ కంపెనీలు పెట్టుబడులు పెడుతున్నాయి. డబ్బులు లేకున్నా, ల్యాండ్ పూలింగ్ వంటి వినూత్న పద్ధతిలో రాజధాని నిర్మిస్తున్నాం. ఇదంతా కేంద్రం సహకారంతోనే సాధ్యమైంది. తమిళనాడులోనూ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే బుల్లెట్ స్పీడ్‌తో అభివృద్ధి జరుగుతుంది" అని ఆయన భరోసా ఇచ్చారు.

**భాషా రాజకీయాలు వద్దు**

ప్రధాని మోదీపై వ్యతిరేకతతో భాషాపరమైన బేధాలు సృష్టించడం సరికాదని చంద్రబాబు హితవు పలికారు. "మాతృభాషను గౌరవించాలి, కానీ ఇతర భాషలపై ద్వేషం వద్దు. హిందీని కేంద్రం జాతీయ భాషగా ప్రకటించలేదు. ప్రధాని మోదీ సైతం మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని చెబుతున్నారు.

భాష పేరుతో అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు" అని అన్నారు. నదుల అనుసంధానం ద్వారా తమిళనాడు నీటి కష్టాలు తీరతాయని, అది ఎన్డీఏతోనే సాధ్యమని తెలిపారు. తిరువళ్లువార్ నుంచి అబ్దుల్ కలాం వరకు ఎందరో మహనీయులు పుట్టిన ఈ గడ్డపై ప్రజలు పురోగామి ఆలోచనలతో ఎన్డీఏకు మద్దతివ్వాలని కోరారు.

# అనకాపల్లిలో రీన్యూ భారీ సోలార్ ప్లాంట్....

**- ఈ నెల 23న శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు**
**- రూ. 5,400 కోట్ల పెట్టుబడితో ఇంగోట్-వేఫర్ తయారీ కేంద్రం**
**- ఏప్రిల్ 23న శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు**
**- ఈ ప్రాజెక్టు ద్వారా 2,100 మందికి పైగా ఉపాధి అవకాశాలు**
**- ఏపీలో మొత్తం రూ. 82,000 కోట్ల పెట్టుబడుల దిశగా రీన్యూ సంస్థ**

అమరావతి – సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో మరో భారీ పెట్టుబడికి రంగం సిద్ధమైంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో సుమారు రూ. 5,400 కోట్ల వ్యయంతో సోలార్ ఇంగోట్–వేఫర్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రముఖ పునరుత్పాదక ఇంధన సంస్థ రీన్యూ ఎనర్జీ గ్లోబల్ ముందుకొచ్చింది. ఈ మెగా ప్రాజెక్టుకు ఏప్రిల్ 23న ముఖ్యమంత్రి చంద్రబాబు, రీన్యూ సీఈఓ సుమంత్ సిన్హాతో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ. 4,200 కోట్లతో 6 గిగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ఇంగోట్–వేఫర్ తయారీ ప్లాంట్‌ను, మరో రూ. 1,200 కోట్లతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ పవర్ ప్లాంట్‌ను రీన్యూ నిర్మించనుంది. కేవలం 24 నెలల రికార్డు సమయంలోనే ఈ ప్లాంట్‌లో కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,100 మందికి పైగా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సోలార్ పీవీ మాడ్యూల్స్, సెల్స్ తయారీకి అత్యంత కీలకమైన ఇంగోట్స్, వేఫర్లను దేశీయంగా ఉత్పత్తి చేయడం ద్వారా సోలార్ సరఫరా రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు ఈ ప్లాంట్ దోహదపడనుంది. 2015 నుంచి రాష్ట్రంలో కార్యకలాపాలు సాగిస్తున్న రీన్యూ, ఇప్పటికే అనంతపురం జిల్లాలో రూ. 22,000 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రెన్యూవబుల్ ఎనర్జీ కాంప్లెక్స్‌ను నిర్మిస్తోంది. తాజా ప్రాజెక్టుతో కలిపి రాష్ట్రంలో మొత్తం రూ. 82,000 కోట్ల పెట్టుబడుల దిశగా రీన్యూ అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టుతో అనకాపల్లి పారిశ్రామిక

## అక్రమాలపై
# న్యాయ పోరాటం చేద్దాం

(మొదటిపేజీ తరువాయి)
కడప ఎంపి వైఎస్.అవినాష్ రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జిల్లా ముఖ్య నేతలు ఘన స్వాగతం పలికారు. వైసిపి కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు, అభిమానులను ఆప్యాయంగా జగన్ పలకరిస్తూ వారు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు అక్రమాల గురించి వారు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై జగన్ సందిస్తూ.. కలిసికట్టుగా న్యాయపోరాటం చేస్తామని, ఎవరూ నిరుత్సాహపడకుండా పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని, అన్ని విషయాలూ తన దృష్టికి వచ్చాయని కొద్ది రోజులు ఓపిక పట్టాలని సూచించారు. అనంతరం జిల్లా సమస్యలపై వైసిపి ముఖ్య నాయకులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపులు ఎక్కువయ్యాయని ముఖ్య నాయకులు జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలో కార్యాచరణ, ప్రణాళికలు రూపొందిస్తామని అంత వరకూ సమయస్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు.

# సంపాదకీయం

## రైతులను ముంచేస్తున్న నకిలీ విత్తనాలు





రైతన్న నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని అక్ర మ విత్తన వ్యాపారులు మళ్లీ పడగ విప్పుతున్నారు. ప్రభుత్వం కఠినంగా నిషేధించిన హెచ్‌టీబీటీ లేదా 'గ్లైసిల్' పత్తి విత్తనాలు మార్కెట్‌లో గుట్టుచప్పుడు కాకుండా అమ్ముడవుతున్నాయి. గత ఏడాదితో పోలి స్తే ఈ సీజన్‌లో వీటి వాడకం దాదాపు 25 నుంచి 30 శాతం వరకు పెరిగినట్టు వ్యవసాయరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

నిషేధిత విత్తనాలు ప్రధానంగా పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి. మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల మీదుగా భారీ గా గ్లైసిల్ విత్తనాలు రాష్ట్రంలోకి వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా, ఎన్టీఆర్, గుంటూ రు జిల్లాల పరిసర ప్రాంతాల నుంచి ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు ఈ విత్తనాల రవాణా యథేచ్ఛగా సాగుతున్నది. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు ప్రాంతం నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లోకి కూడా అక్రమంగా విత్తనాలు చేరుతున్నాయి. అధికారుల దాడుల్లో కొంతమేర విత్తనా లు పట్టుబడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో విక్రయాలు మాత్రం ఆగడం లేదని సమాచారం.గ్లైసిల్ పత్తి విత్తనాలను ప్రభుత్వం నిషేధించింది. అయితే ఏంటట.. అంటూ వ్యాపారులు హెచ్‌టీబీటీ అని పిలిచే ఈ పత్తి విత్తనాలను మార్కెట్‌లో గుట్టుచప్పుడు కాకుండా అమ్ముతున్నారు. అంతేకాదు ఈ సీజన్‌లో ఈ విత్తనాల వాడకం 30 శాతం వరకు పెరిగింది! మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల నుంచి రాష్ట్రంలోకి భారీగా గ్లైసిల్ పత్తి విత్తనాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి.గ్లైసిల్ విత్తనాలకు వాడే గ్లైఫోసేట్ రసాయనం కార ణంగా నేలలో ఉండే 'నైట్రోజన్ ఫిక్సింగ్' బ్యాక్టీరియా సుమారు 40 శాతం వరకు తగ్గిపోతున్నట్లు నిపుణులు చెబుతున్నా రు. దీనితో భూమి నిస్సారంగా మారుతున్నది. భవిష్యత్తులో పంటలు పండక భూములన్నీ ఎడారిగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక, మహారాష్ట్రలో గడ్డి మందుపై నిషేధం లేకపోవడంతో అక్కడి నుంచి కొంతమంది తెచ్చి ఇక్కడి రైతులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ప్రారంభంలో కలుపు నివారణ ఖర్చు త గ్గుతుందని రైతులు భావించినప్పటికీ, మూ డేండ్ల తర్వాత భూమి నిస్సారంగా మారడంతో ఖర్చు ఎకరాకు రూ. 10,000 నుంచి రూ.15,000 వరకు పెరుగుతున్నది.గ్లైఫోసేట్ వంటి ఘాటైన రసాయనాల వల్ల నేలలోని మేలు చేసే సూక్ష్మజీవులు నశించి భూమి నిస్సారంగా మారుతుంది.

భవిష్యత్తులో పంటలు పండని ఎడారిగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పంటలపై స్ప్రే చేసే కలుపు సంహారక మందుల వల్ల గాలి కాలుష్యం పెరిగి, వాటిని పీల్చే రైతులు, కార్మికుల ఊపిరితిత్తులు దెబ్బతింటాయని చెబుతున్నారు. చర్మ వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదం పొంచి ఉన్నద ని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అనుమతి లేని విత్తనాలను అమ్మడం, వాడటం చట్టప్రకారం నేరం. పట్టుబడితే జరిమానాలతోపాటు జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందిఇప్పటికైనా మన నేలను కాపాడుకోవడం ప్రభుత్వంతోపాటు మనందరి బాధ్య త. భూదేవిని రక్షించాలంటే అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గ్లైసిల్ విత్తనాల మూలాలను అణచివేయాలి. అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి. రైతులు కూడా తక్షణ లాభాల కంటే నేల ఆరోగ్యాన్ని ముఖ్యంగా భావించాలి. వ్యవసాయశాఖ సమన్వయంతో సరిహద్దుల వద్ద నిఘా పెంచి, గ్రామాల్లో గ్లైసిల్ వాడకం వల్ల కలిగే నష్టాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.గ్లైసిల్ విత్తనాలకు వాడే గ్లైఫోసేట్ రసాయనం కారణంగా నేలలో ఉండే 'నైట్రోజన్ ఫిక్సింగ్' బ్యాక్టీరియా సుమారు 40 శాతం వరకు తగ్గిపోతున్నట్టు నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రజారోగ్యానికి ముప్పు

ఈ విత్తనాలకు వాడే రసాయనాలు, పంటపై పిచికారీ చేసే మందుల వల్ల వ్యవసాయ కార్మికుల్లో శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులు 20 శాతంపైగా ఎక్కువగా నమోదవుతున్నాయని ప్రాథమిక అధ్యయనాలు చెబుతున్నాయి. నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కేసులేగ్లైసిల్ పత్తి విత్తనాలు, గ్లైఫోసేట్ వంటి నిషేధిత గడ్డి మందులు వాడటం వల్ల భూసారం దెబ్బతింటుంది. అవి మనుషుల ఆరో గ్యానికి కూడా ప్రమాదకరం. రైతు లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే నాణ్య మైన పత్తి విత్తనాలు కొనుగోలు చేయాలి. నిషేధిత విత్తనాలు వాడితే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. మేము తనిఖీలు నిర్వహిస్తున్నాం అని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ, అవి చిన్నపాటి వ్యాపారులకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ దందా వెనుక ఉన్న అసలైన పెద్దలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకంజ వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా వేల ఎకరాల్లో గ్లైసిల్ పత్తి సాగవుతున్నట్టు అంచనా ఉన్నా, చర్యలు మాత్రం నామమాత్రంగానే ఉన్నాయని రైతులు అంటున్నారు.నాణ్యమైన విత్తనాలు వేసుకున్న రైతులు సకాలంలో పత్తి పంటను కోయగా, గ్లైసిల్ విత్తనాలు వాడిన రైతుల పంట మాత్రమే ఆలస్యంగా చేతికి వచ్చిందని చెబుతున్నారు. దీంతోపాటు మహారాష్ట్రలో గడ్డి మందుపై నిషేధం లేకపోవడంతో అక్కడి నుంచి తెచ్చి ఇక్కడి రైతులకు అధిక ధరలకు అమ్ముతున్నట్టు తెలిసింది.

# డీసీహెచ్‌ఎస్‌లో అక్రమ నియామకాలు




- నిబంధనలకు విరుద్ధంగా కారుణ్యనియామకాలు
- నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలు
- కమిటీ సభ్యుల తీరుపై పలు అనుమానాలు

అనంతపురం బ్యూరోచీఫ్, సూర్య వాస్తవం

అనంతపురం జిల్లా డీసీహెచఎస్ పరిధిలోని ప్రాంతీయ ఆసుపత్రులు, సీహెచ్సీ కేంద్రాలలో చాలా మంది అక్రమ పద్దతుల్లో నియమితులయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్నారు. ఎలాంటి విద్యార్హతలు లేకున్నా కొంత మంది ఉన్నతాధికారులకు మామూళ్లు ముట్టచెప్పి అక్రమంగా పని చేస్తున్నాఉ. మరికొందరయితే కారుణ్యనియామకాల కింద, ఇతర పద్ధతుల్లో నకిలీ ధ్రువీకరణ పత్రాలతో పని చేస్తుండడం గమనార్హం. ఇదంతా తెలిసినా డిసిహెచఎస్ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

నిబంధనలు ఉల్లంఘించి ఉద్యోగం చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవ టంతో పలు అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. డీసీ హెచఎస్ పరిధిలోని ప్రాంతీయ ఆసుపత్రులు, సీహెచ్సీ కేంద్రాలలో పని చేసేందుకు గత ఐదు సంవత్సరాలుగా పలు నోటిఫికేషన్లు ఇచ్చారు. వివిధ రకాల పోస్టుల్లో వందల సంఖ్యలో నియామకాలు జరిగాయి. గత మూడు సవత్సరాల్లోనే 300పైన పోస్టులను భర్తీ చేశారు. వాటిలో ల్యాప్టాక్నీషియన్, ఫార్మసిస్ట్, ఈసీజీ టెక్నీ షియన్, ప్లంబర్, ఎలక్ట్రిషియన్ తదితర పోస్టులు కూడా ఉన్నారు. కొందరు అయితే పలు ప్రాంతాల్లో పని చేసినట్లు నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి ఉద్యోగాలు పొందారు. మరికొందరు నకిలీ విద్యార్హత, వికలత్వ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు కూడా పొందారు. కారుణ్య నియామకాల్లో అయితే నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాలు ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా కొంద రికి పోస్టులు కట్టబెట్టే శారు. మరికొం దరి నుంచి రూ. లక్షలు దండుకుని ఉద్యోగాలు ఇచ్చారని వెలుగులోకి వచ్చింది. దీంతో కొలువుల భర్తీలో ఆ కార్యాలయంలో పని చేసే ఇద్దరు అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది.

గత మూడు సంవత్సరాలలో సుమారు 300 పోస్టుల పైన భర్తి చేశారు. ఇందులో ఎలాంటి రోస్టర్ పాయింట్ల పద్ధతిని పాటించలేదు. రోస్టర్ ప్రొసెడింగ్ కాపీలను కూడా ఇవ్వలేదు. డబ్బులు ఇచ్చిన వారికి రోస్టర్ పాయింట్లను మార్చి అక్రమం పద్ధతిలో ఉద్యోగాలు ఇచ్చారు. దీంతో అర్హులైన లబ్ధిదారులు నష్టపోయారు. నియామకాల ప్రక్రియ ఎంపికలో ఉన్న కమిటీ సభ్యులపై పలు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. నియామకాలలో పారదర్శకత కోసం పూర్తి ఎంపిక జాబితా, మార్కులు, రోస్టర్ వివరాలు అధికారికంగా వెబ్‌సైట్‌లో పెట్టకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అనంతపురం జిల్లా ఆసుపత్రులు సమన్వయ అధికారి పరిధిలో భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. డిసిహెచఎస్ పరిధిలో పనిచేసే మినిస్టీరియల్ సిబ్బందిలో కొంతమంది కారుణ్య నియామకాలు ద్వారా నియామకం అయ్యారు. కారుణ్య నియామకాలు సవరణ చట్టం ప్రకారం డేట్ ఆఫ్ జాయిన్ సమయంలో నియమాలతో కూడిన ఆర్డర్ ను జారీ చేస్తారు. నిర్ణీత సమయంలో ఇచ్చిన కండిషన్స్ పూర్తి చేసిన వారికి ప్రభుత్వ బెనిఫిట్స్ , తదితర అంశాలపై లబ్ధి చేకూరేలా నియమాలు ఉన్నాయి.ఇవన్నీ ఉల్లంఘించి ఇచ్చిన కండిషన్స్ పూర్తి కాకుండా కొంత మంది ఉద్యోగులు నకిలీ సర్టిఫికేట్‌తో తప్పుడు ధృవీకరణ తో డేట్ ఆఫ్ జాయిన్ నుండి సర్వీసు ధృవీకరించుకొని ఇంక్రిమెంట్లు ప్రమోషన్లు ఇతర బెనిఫిట్స్ పొందారు. జిల్లాలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్, జిల్లా ప్రధాన కార్యాల యంలో పనిచేస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగి, ఇతర సిబ్బంది కారుణ్య నియామకాలు ద్వారా నియామకం అయిన ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. గతంలో రోస్టర్ పాయింట్లు మార్చి ఉద్యోగాలు అమ్ముకున్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అనంతపురం జిల్లాలో జరిగిన అన్ని ఉద్యోగాల నియా మకాలపై విచారణ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న ఉద్యోగులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

# సౌత్ పై ఎల్ నినో ప్రభావం

చెన్నై -సూర్య వాస్తవం




ఈ ఏడాది భారత్‌లోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. నైరుతి రుతుపవనాల రాకపై ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం చూపే అవకాశం ఉందని భారత వాతా వరణశాఖ ప్రాథమిక అంచనా వేసింది. దీని కారణంగా అయితే ఈశాన్య, దక్షిణ, ఉత్తర భారత దేశంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని తాజాగా విడుదల చేసిన తొలి దశ నివేదికలో పేర్కొంది. సాధారణంగా జూన్ 1న కేరళను తాకే రుతుపవనాలు సెప్టెంబర్ 3వ వారం వరకు కొనసాగుతాయి. గత రెండేళ్లుగా వర్షపాతం సమృద్ధిగా ఉన్నప్పటికీ, ఈసారి ఎల్‌నినో ప్రభావంతో మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో వర్షాలు తగ్గవచ్చని అధికారులు భావిస్తున్నారు. రుతుపవనాల చివరి దశ నాటికి ఎల్‌నినో మరింత బలపడే అవకాశం ఉన్నప్పటికీ, వర్షాలు కురవడానికి కూడా సానుకూల పరిస్థితులు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు కర్ణాటకలో వర్షపాతం మిశ్రమంగా ఉండనుంది.

కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ, మరికొన్ని చోట్ల సాధారణం కంటే తక్కువ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. తెలంగాణలో ఉత్తర తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలకు లోటు లేదని అంచనా వేయగా.. దక్షిణ తెలంగాణలో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, మధ్య కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అధిక వర్షాలు కురస్తాయని అంచనా వేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యంతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. అయితే విశాఖపట్నం, అనకాపల్లి, ఉభయ గోదావరి జిల్లాలు, బాపట్ల, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, రాయలసీమలోని కడప, అన్నమయ్య జిల్లాల్లో మాత్రం వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండవచ్చని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది.భారత్‌లో ఈ ఏడాది వర్షాకాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ప్రైవేట్ వాతావరణ అంచనా సంస్థ స్కైమెట్ ఇటీవల వెల్లడించింది. ముఖ్యంగా జూన్ నుండి సెప్టెంబర్ వరకు కొనసాగే నైరుతి రుతుపవనాల కాలంలో, రెండో భాగంలో ఎల్ నినో ప్రభావం బలంగా ఉంటుందని ఆ సంస్థ పేర్కొంది. దీనివల్ల వర్షాలు తగ్గుముఖం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి. సాధారణంగా ఈ నాలుగు నెలల కాలంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతం 868.6 మి.మీ ఉండాలి, కానీ ఈసారి అందులో కేవలం 94 శాతం మాత్రమే వర్షాలు కురిసే అవకాశం ఉందని సంస్థ అంచనా వేసింది.భారత్‌లో ఏడాది పొడవునా నమోదయ్యే మొత్తం వర్షపాతంలో దాదాపు 70 శాతం కేవలం ఈ నైరుతి రుతుపవనాల ద్వారానే లభిస్తుంది. దేశ జీడీపీకి వెన్నెముకగా నిలిచే వ్యవసాయ రంగానికి ఈ వర్షాలు అత్యంత ప్రాణాధారం. మన దేశ జనాభాలో సగానికి పైగా ప్రజలు నేటికీ జీవనోపాధి కోసం నేరుగా వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నందున, వర్షపాతంలో స్వల్ప తగ్గుదల కూడా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉంది.రైతులకు అత్యంత కీలకమైన ఖరీఫ్ సాగు సాధారణంగా జూన్, జూలై నెలల్లోనే ప్రారంభమవుతుంది.

ఈ సమయంలో నైరుతి రుతుపవనాలు సరైన సమయానికి రావడం, దేశవ్యాప్తంగా త్వరగా విస్తరించడం పంటల దిగుబడికి చాలా అవసరం. సాధారణంగా జూన్ 1న లేదా జూన్ మొదటి వారంలో కేరళను తాకే ఈ రుతుపవనాలు, జూలై 15 నాటికి ఉత్తరాది సహా దేశంలోని అన్ని రాష్ట్రాలకు విస్తరిస్తాయి. అయితే, ఎల్ నినో ప్రభావం వల్ల ఈ విస్తరణలో గానీ, వర్షాల తీవ్రతలో గానీ మార్పులు వచ్చే అవకాశం ఉండటంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది.

# ఏపీ జెఎసి జనరల్ సెక్రెటరీగా బైరిశెట్టి ఎంపిక



**కదిరి - సూర్య వాస్తవం:** కదిరి తాలూకా ఆంధ్రప్రదేశ్ నేషనల్ మజ్దూర్ సంఘం ఏపీఎస్ఆర్టీసీ తాలూకా ప్రధాన కార్యదర్శిగా ఎస్ బెరిసెట్టిని ఏకగ్రీవంగా ఎంపికయ్యారని మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు, ఆర్టీసీలో బలమైన ఎన్ఎంయు ఏ కార్యదర్శిగా గత 20 సంవత్సరాలు నుండి సమర్ధవంతంగా పనిచేయుచున్న తరుణంలో అతని హయాంలో జరిగిన ఎన్నికల్లో చురుకుగా పాల్గొని ఎన్ఎంయు విజయానికి బహుదపడ్డారని తోటి నాయకులు ప్రశంసలు కురిపించారు, తద్వారా ఏపీఎస్ఆర్టీసీ కదిరి డిపోలోని కార్మికుల సమస్యలపై ఎన్నో ఉద్యమాలు, ధర్నాల ద్వారా ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారాలపై కృషిచేసిన నాయకుడిగా ఎదిగారు, ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించే తరుణంలో మరిన్ని ఉన్నత పదవుల కు అవకాశం ఇచ్చే విధంగా తోటి కార్మిక సంఘాలు ఏకగ్రీవంగా ఎంపిక చేయబడ్డారని తెలిపారు, ఈ ఎంపిక తనపై మరింత బాధ్యతను పెంచిందని ఆయన తెలిపారు, కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ కి, తాలూకా అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి కి, ఎన్ఎంయు రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ రావుకు, ఎనిమిది రాష్ట్ర నాయకులు పివి రమణారెడ్డి కి, ఉపాధ్యక్షులు హరి మోహన్, ఎన్వి రమణ లకు ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమంలో కదిరి డిపో నాయకులు రామకృష్ణ, సురేంద్ర, జీవుల నాయక్, శ్రీనివాసులు, రామచంద్ర, రవీంద్ర, మల్లికార్జున, లక్ష్మీనారాయణ, అశ్వద్ధామయ, భాష, సురేందర్ రెడ్డి, అజిత్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు

# మహిళా బిల్లును పదేళ్లు వాయిదా వేసేందుకు బీజేపీ కుట్ర

**-పిసిసి జనరల్ సెక్రటరీ షేక్ అల్లాబకష్ (సీఎల్పీ)**



**రాయచోటి-సూర్య వాస్తవం:** మహిళా రిజర్వేషన్ బిల్లును మరో పదేళ్లకు వాయిదా వేసేందుకు భాజపా ప్రభుత్వం కుట్ర పన్నిందని లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించిన విషయం అందరికీ తెలిసిందే అని పిసిసి జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్ (సీఎల్పీ) అన్నారు.మంగళవారం స్థానిక పాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన వివేకరులతో మాట్లాడుతూ దక్షిణ భారతదేశ గళాన్ని నొక్కేందుకు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాల లోక్సభ నియోజకవర్గాల సంఖ్యను తగ్గించి ఆ రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గించడానికి ప్రయత్నిస్తుందని రాహుల్ గాంధీ ఆరోపించిన విషయం కూడా దేశ ప్రజలకు బాగా తెలుసు అని చెప్పారు. 2023 మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణం అమలు చేస్తే కాంగ్రెస్ మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది అన్నారు. ఈ బిల్లును పదేళ్లు వాయిదా వేయాలని భాజపా భావిస్తుందని తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. భాజపా చేస్తున్న ఒక్కొక్క కుట్ర అది కాంగ్రెస్ పార్టీకి బలం చేకూరుతుందని, భవిష్యత్తులో రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేస్తాయని ఆయన చెప్పారు.

# యూరేనియం నిర్వాసితుల నియామకాల్లో పక్షపాతం వద్దు

**- భూ నిర్వశితులందరికి తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలి :**

**- పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి**



**వేముల- సూర్య వాస్తవం:** యూరేనియం ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం ఉద్యోగాలు కల్పించాలని స్పష్టం చేస్తున్నాము. గత పాలకుల కనుసన్నల్లో మెలుగుతూ ఈసీ ఐ ఎల్ ఉద్యోగి నవీన్ కుమార్ రెడ్డి కేవలం ఎంపీ అవినాష్ రెడ్డికి కొమ్ముకాస్తూ, ఒక రాజకీయ పార్టీ వారి తరపున మాత్రమే ఉద్యోగాలు ఇవ్వడం చాలా తప్పు అని బి టెక్ రవి పులివెందుల ఆర్డీఓ ని ఆదేశించడం జరిగింది. జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ నిర్వహించినప్పుడు వచ్చే పారదర్శకమైన జాబితా ఆధారంగా మాత్రమే నియామక ప్రక్రియ చేపట్టాలని, అప్పటి వరకు ఎలాంటి నియామకాలను పరిగణనలోకి తీసుకోవద్దని అధికారులకు సూచించాము. అధికారులు పాత పద్ధతులు వీడి, ప్రభుత్వ నిబంధనలకు లోబడి పనిచేయాలి, లేని పక్షంలో చర్యలు తప్పవు. అదేవిధంగా యూరేనియం ప్రభావంతో తీవ్రంగా నష్టపోతున్న కొట్టాల గ్రామ తరలింపుపై అధికారులు తక్షణమే స్పష్టతనిచ్చి, నిర్వాసితులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేముల మండల టిడిపి నాయకులు పార్థసారథి రెడ్డి ఇతర టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు .

## మలేరియా రహిత సమాజం కోసం

# ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**- సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య**



**వేముల సూర్య వాస్తవం:** మలేరియా నిర్మూలనే ధ్యేయంగాఇప్పుడు మనం సాధించగలం.. ఇప్పుడు మనం తప్పక సాధించాలి"లి అనే నినాదంతో వేముల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో మంగళవారం 'ప్రపంచ మలేరియా దినోత్సవం' సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మలేరియా వ్యాధిపై అవగాహన సదస్సు మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ.. మలేరియా అనేది ఆడ అనాఫిలిస్ దోమల ద్వారా వ్యాపించే ప్రమాదకరమైన వ్యాధి అని, దీని పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రధానంగా ఈ క్రింది నివారణ చర్యలు పాటించాలని ఆయన వివరించారు. పరిసరాల పరిశుభ్రతలి: నివాస ప్రాంతాల చుట్టూ మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చు. వ్యక్తిగత రక్షణ: రాత్రి వేళల్లో తప్పనిసరిగా దోమతెరలు వాడాలని, శరీరం పూర్తిగా కప్పబడేలా దుస్తులు ధరించడం ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చని తెలిపారు.?త్వరిత చికిత్సలి చలితో కూడిన జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించి రక్త పరీక్ష చేయించుకోవాలని కోరారు.

**?వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులు:**

'మలేరియా నిర్మూలనలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహం గా పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విజేతలు మాధవి, రేణుక, ఇందిర, యశస్విని లకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో తమ గ్రామాల్లో ప్రజలకు మలేరియా నివారణపై అవగాహన కల్పించాలని సిద్దయ్య కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఉషారాణి, హెల్త్ సూపర్ వైజర్ రమేష్, విజయలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాసులు, రాజేశ్వరి, పాఠశాల ప్రిన్సిపల్ శారదమ్మ, ఏఎన్ఎం వసుంధర, ఆశా కార్యకర్త శివపార్వతి మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## మండల పరిధిలోని గార్లదిన్నె కేజీబీవీ పాఠశాలలో

# క్రీడా సాంస్కృతి కార్యక్రమాలపై అవగాహన







**గార్లదిన్నె - సూర్య వాస్తవం:** గార్లదిన్నె మండలంలో కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన ప్రిన్సిపల్ నాగసత్య ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంఈఓ 1 తారా చంద్ర నాయక్, ఎంఈఓ 2 వెంకటరమణ నాయక్ పాల్గొనడం జరిగినది ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ పిల్లలకు చదువులతో పాటు క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల లో పిల్లలను ఉత్తేజపరిస్తే వారి మానసిక వికాసానికి మనోధైర్యానికి తోడ్పడుతాయన్నారు అందు కోసమే ప్రభుత్వము ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాల ల్లో ఈ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్లు ఎంఈఓ లు తెలిపారు ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓలు చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగసత్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆటలు సాంస్కృతిక కార్యక్రమాల లో కూడా తమ నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని దీనికి విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని కార్యక్రమానికి వచ్చినటువంటి తల్లిదండ్రులకు తెలియజేశారు ఈ కార్యక్రమానికి వచ్చినటువంటి ఎంఈఓ 1 తార చంద్ర నాయక్ కి మరియు ఎంఈఓ 2 వెంకట రమణ నాయక్ కి మరియు విద్యార్థినులకు ఉపాధ్యాయ సిబ్బందికి ప్రిన్సిపల్ నాగ సత్య ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.




# భవిత కేంద్రాలకు మాడ్యూల్స్ పంపిణీ

**శ్రీ సత్య సాయి బ్యూరో -సూర్య వాస్తవం:** శ్రీ సత్య సాయి జిల్లా కొత్తచెరువు భవితా కేంద్రంలో దివ్యాంగుల పిల్లలకు బోధించడానికి సమగ్ర శిక్ష తరపున ప్రతి మండలానికి మాడ్యూల్స్ ను శ్రీ సత్య సాయి జిల్లా సమగ్ర శిక్ష ఏపీసి జి. కృష్ణప్ప మంగళవారం మాడ్యూల్స్ ను పంపిణీ చేశారు. ఈ మ్యాడ్యూల్స్ ను జిల్లా లోని అన్ని భవితా కేంద్రాలకు అందించడం జరిగిందని సహిత విద్య కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్పీ పుల్లన్న తెలిపారు . ఈ సందర్భంగా ఇంచార్జ్ ఏపీసీ మాట్లాడుతూ ఈ మాడ్యూల్స్ ని పిల్లలకు అర్థమయ్యే విధంగా వారు ఒక్కొక్క పిల్లవాడు ఒక్కొక్క విధమైన ప్రతిభను కలిగి ఉంటారన్నారు.. వారి ప్రతిభా సామర్థ్యాలను బట్టి మాడ్యూల్స్ ను ఉపయోగించి వారి సామరాధ్యలను ను మరింత మెరుగయ్యే విధంగా చేయాలన్నారు . సహిత విద్యా సమన్వయ కర్త డాక్టర్ ఎస్పీ పుల్లన్న మాట్లాడుతూ మాడుల్స్ ను ఉపయోగించి విద్య అభ్యసన ప్రక్రియ ను సమర్ధ వంతంగా నిర్వహించమని మండలంలోని ప్రతి ఐ ఈ ఆర్ పి కి చెప్పడం జరిగిందన్నారు . ఈ కార్యక్రమం లో సమగ్ర శిక్ష సూపరింటెండెంట్ బలరామిరెడ్డి మరియు ఐ ఈ ఆర్ పి లు రామ్మోహన్ రెడ్డి, శ్రీనివాసులు రమేష్ బాబు, మల్లికార్జున పాల్గొన్నారు .

# తెలంగాణలో ఆర్టీసీ సమ్మె సైరన్..

**- నేటి అర్ధరాత్రి నుంచి బస్సులు బంద్**



**హైదరాబాద్ -సూర్య వాస్తవం:**
తెలంగాణలో ఆర్టీసీ సమ్మెకు సర్వం సిద్ధమైంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి సమ్మె ప్రారంభం కానుంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఏప్రిల్ 22, బుధవారం మొదటి డ్యూటీ నుంచి బస్సులు నిలిచిపోనున్నాయి. ప్రభుత్వం నుంచి చర్చలకు అధికారిక ఆహ్వానం, డిమాండ్లపై స్పష్టమైన హామీ రాకపోవడంతో సమ్మెకే మొగ్గు చూపుతున్నట్లు ఆర్టీసీ ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) ప్రకటించింది. జేఏసీతో పాటు ఇతర కార్మిక సంఘాలు సైతం సమ్మెకు మద్దతు ఇవ్వడంతో ఆర్టీసీలోని దాదాపు అన్ని యూనియన్లు ఇందులో పాలుపంచుకోనున్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బస్సు సర్వీసులపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈ పరిణామాల నేపథ్యంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం తన నివాసంలో ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలుస్తోంది.

## ట్రబులింజన్ సర్కార్ గా

# తయారైన డబులింజన్ సర్కార్

## డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె సూర్య వాస్తవం:** కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే కూటమి అధికారంలో ఉండడం వల్ల డబులింజన్ సర్కార్ వల్ల ఆంధ్రప్రదేశ్ కు మేలు జరిగిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమిళనాడు ఎన్నికల ప్రచారంలో చెప్పడం హాస్యాస్పదమని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లిలో తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చెప్పింది నిజమే అయితే డబులింజన్ సర్కార్లో ఆంధ్రప్రదేశ్ కు సంజీవని లాంటి ప్రత్యేక హోదా ఎందుకు అమలు కాలేదు అని సూటిగా ప్రశ్నించారు. విభజన చట్టంలో సెక్షన్ 46 సబ్ సెక్షన్ 3 ప్రకారము రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ డబులింజన్ సర్కార్లో ఎందుకు అమలు కాలేదు. విభజన చట్టంలో 13వ షెడ్యూల్ ప్రకారం కడప జిల్లాలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో సమీకృత ఉక్కు కర్మాగారం డబుల్ ఇంజన్ సర్కార్ లో ఎందుకు అమలు కాలేదు. విభజన చట్టంలో 13వ షెడ్యూల్ ప్రకారము దుగ రాజపట్నం వద్ద మేజర్ ఓడరేవు డబుల్ ఇంజన్ సర్కార్లో ఎందుకు నిర్మించలేదు/ విభజన చట్టంలో సెక్షన్ 94 సబ్ సెక్షన్ 3 ప్రకారము ఆంధ్రప్రదేశ్లో రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వము గ్రాంట్ రూపంలో నిధులు ఇవ్వాలి. డబుల్ ఇంజన్ సర్కార్ లో ఎందుకు ఇవ్వలేదని తులసి రెడ్డి ప్రశ్నించారు. విభజన చట్టంలో సెక్షన్ 90 ప్రకారం పోలవరం బహుళార్త సాధక ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తిచేసి జాతికి అంకితం చేయాలి . 12 సంవత్సరాలైనా ఎందుకు నత్తనడక సాగుతొందని తులసిరెడ్డి ప్రశ్నించారు. కాగ్ నివేదిక ప్రకారం 2023 -24 ఆర్థిక సంవత్సరంలో వైకాపా ప్రభుత్వ పాలనలో కేంద్రం నుండి రాష్ట్రానికి 34,698 కోట్ల రూపాయల గ్రార్ రాగా 2024 - 25 లో డబుల్ ఇంజన్ సర్కార్ లో కేవలం 20135 కోట్ల రూపాయలు మాత్రమే కేంద్రం నుండి గ్రాంట్ వచ్చింది.అనగా 1 4,5 6 3 కోట్ల రూపాయలు నిధులు తగ్గిపోయాయి. పైన పేర్కొన్న అంశాలను పరిశీలిస్తే డబుల్ ఇంజన్ సర్కార్ లో మేలు జరగకపోగా కీడు జరిగినట్లు స్పష్టంగా అర్థం అవుతుంది . డబుల్ ఇంజన్ సర్కార్ ట్రబుల్ ఇంజన్ సర్కార్ గా, డొక్కు ఇంజన్ సర్కార్గా తయారైనట్లు స్పష్టంగా అర్థం అవుతుందని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు.



## రాకేష్ యాదవ్‌కు శ్రద్ధాంజలి ఘటించిన తులసి రెడ్డి

**వేంపల్లె సూర్య వాస్తవం:** కడప జిల్లా, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం, వేంపల్లి మండలం, చింతలమడుగు గ్రామానికి చెందిన నల్ల మేకల రామస్వామి మనుమడు నల్ల మేకల రాకేష్ యాదవ్ సోమవారం నెల్లూరు --ముత్తుకూరు రహదారిపై రోడ్డు ప్రమాదంలో స్వర్గస్తులయ్యారు. రాకేష్ యాదవ్ ముత్తుకూరు లోని ఓ కళాశాలలో ఫార్మా డి మూడవ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం రాకేష్ యాదవ్ పార్థివదేహానికి చింతల మడుగు పల్లిలో రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,నామా వినయ్ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. రాకేష్ పవిత్ర ఆత్మకు ప్రశాంతిని ప్రసాదించాలని పరమేశ్వరుని ప్రార్థించారు.ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాప సానుభూతిని తెలియజేశారు.

## ప్రజా రక్షణే ధ్యేయంగా

# పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం

**- ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం**



**శాంతిపురం - సూర్య వాస్తవం:** ప్రజా రక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఏపి ఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం అన్నారు.మంగళవారం "సురక్ష చిత్తూరు -- మీ భద్రత మా బాధ్యత" కార్యక్రమంలో భాగంగా రాళ్లబుదుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలలో "ధైర్య స్పర్శ" వాహనం తో ప్రజల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని కోరారు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడటానికి పోలీసులకు ప్రజల సహకారం అందించాలని కోరారు.వారు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజాసేవ కోసం కృషి చేస్తున్నారన్నారు.అలాంటి పోలీసు లకు మీ సమీపంలో అనుమానాస్పద కార్యకలాపాలు ఏదైనా గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో కుప్పం మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ డి.సుధీర్,యువనేత, గిరిధర్, రాళ్లబూదుగూరు సబ్ ఇన్‌స్పెక్టర్ ఐ.నరేష్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# రాయంపల్లిలో మట్టి మాఫియా అరాచకం

## - పొక్లెయిన్లతో కాలువ గట్టును పిండేస్తున్న వైనం!

**- రూ. 600ల కోసం గట్టుకే ఎసరు: రేపు కాలువ తెగితే బాధ్యులెవరు?**

**ఉరవకొండ - సూర్య వాస్తవం:** ఉరవకొండ మండలం, రాయంపల్లి పరిసరాల్లోని తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్ఎల్‌సీ) గట్టు.పరిస్థితి ఏంటి ?ఏం జరుగుతోంది. అక్రమార్కులు పొక్లెయిన్లతో కాలువ గట్టును తవ్వి, ఆ మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.?మట్టిని విచ్చలవిడిగా తరలించడం వల్ల కాలువ గట్టు బలహీనంగా మారుతోంది. దీనివల్ల వర్షాలు పడినప్పుడు లేదా కాలువకు నీరు వదిలినప్పుడు గట్టు తెగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.?ఆర్థిక అంశాలు ఆ అధికారుల పాత్ర ఇక్కడి మట్టి నాణ్యతగా ఉండటంతో ఒక ట్రాక్టర్ మట్టిని రూ. 600 పైగా ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.ఈ అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదని, వారి నిర్లక్ష్యం వల్లే మట్టి మాఫియా రెచ్చిపోతోందని స్థానికులు వాపోతున్నారు.

## సీతారామాంజనేయ స్వామి రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట





**సూర్య వస్తవం - తనకల్లు:** శ్రీ సత్య సాయి జిల్లా మండల పరిధిలోని తవళం గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ ప్రసన్నాంజ నేయ స్వామి రథోత్సవం ( తేరు దాత ) శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ మంగళవారం ఉదయం 9 గంటలకు ఘనంగా నిర్వహించి,సీతారామాంజనేయ స్వామి రథోత్సవంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం స్వామి వారిని దర్శించుకుని గ్రామ ప్రజలతో కలిసి రథోత్సవంలో పాల్గొన్న కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్, మండల చుట్టుపక్కన గ్రామస్తులంత పెద్ద ఎత్తున రథోత్సవంలో పాల్గొని అంగరంగ వైభవంగా అలంకరించి తేరు రథోత్సవంలో ఊరేగించి స్వామివారి కృపకు ప్రార్థులై గ్రామ ప్రజలు ప్రార్థనలు చేసుకున్నారు

**ప్రజానాయకుడు పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని**

## మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు





**పామిడి - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ శస్త్ర చికిత్స చేయించుకొని వైద్యుల సలహా మేరకు విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కళ్యాణ్ త్వరగా ప్రజా సంక్షేమానికై రాష్ట్ర అభివృద్ధికై పనిచేయుటకు పూర్తి ఆయురారోగ్యాలతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మంగళవారం పామిడి మండల జనసేన పార్టీ మండలాధ్యక్షుడు ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక దత్తాత్రేయ స్వామి దేవస్థానంలోని కార్యసిద్ధి ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించి పవన్ కళ్యాణ్ పేరిట అర్చనలు చేయించి అలాగే శ్రీ దత్తాత్రేయుడికి ప్రత్యేక పూజలు అర్చన చేయించడం జరిగినది ఈ కార్యక్రమంలో పామిడి మండల జనసేన పార్టీ అధ్యక్షులు యం.ధనుంజయ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ నల్ల ఖాదర్ శేక్షావలి,కోయిల దీన్నే సూర్యనారాయణ,నక్కల రామాంజనేయులు, కొట్టాల చలపతి,నక్కల నవీన్, తిమ్మప్ప, రాజు, బి .లక్ష్మీనారాయణ మరియు జనసేన పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొనడం జరిగినది.

# తోమాల అలంకరణలో వాసవి కన్యాకాపరమేశ్వరి అమ్మవారి

**పామిడి- సూర్యవాస్తవం:** నయన మనోహర ముత్యాల తోమాలలు పామిడి లో ఈనెల 26న నిర్వహించు వాసవి జయంతి రోజున అలంకరించడానికి రూపుదిద్దు కున్నాయి. వాసవి కన్యాకాపరమేశ్వరి అమ్మవారి మూల విరాట్ కు, ఉత్సవ విగ్రహానికి వేరువేరు గా 10రోజుల పాటు భగవతి నామ స్మరణ తో,ఉపవాస దీక్షతో భక్తి భావం తో ఈ హారాలను రూపొందించమని ఇదే గ్రామ భక్తురాలు తల్లం లత ప్రకాష్ తెలిపారు. తన కుమారులు నిఖిల్, నితిన్ ఈ ముత్యాలు సమకూర్చారని అర్చకులు తెలిపారు



# వేంపల్లెలో పెట్రోల్ కష్టాలు



**వేంపల్లె సూర్య వాస్తవం:**
వేంపల్లె లో మంగళవారం స్థానికంగా ఉన్న పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొరత కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురయ్యా వారు. వేంపల్లెలో స్థానిక పెట్రోల్ బంకుల్లో మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు పెట్రోల్ బంకులలో పెట్రోల్ మరియు డీజిల్ లేక ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవ్వడం జరిగింది. స్థానికంగా ఉన్న కొంతమంది వాహనదారులు మరియు నిత్యం వాహనాల ద్వారా సరుకు రవాణా చేయు కొంతమంది చిరు వ్యాపారస్తులు డీజిల్ లేకపోవడం వల్ల అలాగే బతుకు జీవుడా అని మోటార్ సైకిల్ పై నిత్యం ప్రయాణించు చిరు ఉద్యోగులు వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు.





సొంతగూటికి చేరుకున్న వైఎస్ జగన్ కి

# పార్టీ శ్రేణుల ఘనస్వాగతం

## నేడు నియోజకవర్గ పరిధిలో పర్యటించనున్న జగన్

**పులివెందుల - సూర్య వాస్తవం:** వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మూడు రోజుల కడప జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం పులివెందులకు చేరుకున్నారు. జిల్లావ్యాప్తంగా వైసీపీ శ్రేణులు పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘనస్వాగతం పలికారు.పర్యటనలో భాగంగా నేడు ఉదయం వైఎస్ జగన్ పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.ఉదయం 9 గంటలకు పులివెందులలోని తన నివాసం నుంచి రోడ్డు మార్గాన లింగాల మండలం ఇప్పట్ల గ్రామానికి బయలుదేరి వెళతారు.ఇటీవలే మరణించిన వైఎస్సార్సీపీ సీనియర్ నేత దివంగత సుధాకర్ రెడ్డి నివాసానికి చేరుకుని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పనున్నారు.?మాజీ సీఎం పర్యటన నేపథ్యంలో లింగాల మండలం మరియు ఇప్పట్ల గ్రామంలో వైఎస్సార్సీపీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశాయి. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పార్టీ శ్రేణులు అభిమానులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దివ్యాంగుల చేతివృత్తుల శిక్షణా కేంద్రానికి ఆర్థిక సహాయం

### స్వర్ణవ్యాపారి పట్టాభి



**పులివెందుల సూర్య వాస్తవం:** పులివెందులలోని ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు చిలుకూరు పట్టాభి కుమార్తె హారిక జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాగభూషణం తదితరులు దివ్యాంగులతో కలిసి హారికకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తనకుమార్తె జన్మదిన సందర్భంగా, ప్రముఖస్వర్ణవ్యాపారి పట్టాభి, దివ్యాంగుల చేతివృత్తుల శిక్షణా కేంద్రానికి ఐదువేల రూపాయలు వితరణగా అందించారు. అనంతరం దివ్యాంగులకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షులు డా.ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు పట్టాభి రామయ్య, రిటైర్డ్ టీచర్ నాగభూషణం, టైలరింగ్ టీచర్ మల్లీశ్వరి, కుట్టు శిక్షణార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు

# వంద పుట్టినరోజులు జరుపుకోవాలి

### రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు



**రాయచోటి-సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నా య ు డ ు 76 వ పుట్టినరోజు సందర్భంగా స్థానిక మాసాపేట లో వెలిసిన శ్రీవెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శుభవాసి ప్రసాద్ ప్రత్యేకంగా తయారు చేసిన 76 కేజీల పసుపు రంగులో ఉన్న కేక్ ను సోమవారం పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేశారు. ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా చంద్రబాబు పుట్టినరోజున ఒకరికొకరు కేక్ తినిపించుకుని పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సేవలు ఎంతో అనవసరం అని ఆయన ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఇలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు 100 పుట్టినరోజులు జరుపుకోవాలని వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఈ కార్యక్రమం చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఇర్షాద్, మన్నేరు,బడిశెట్టి రవి, గోల్డ్ ఖదీర్, మండి ఫారుక్, శీను,షకీల్, ఫయాజ్, హోటల్ ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షన్

# సింగిల్ ప్లాస్టిక్ యూసెజ్ పై అవగాహనా

**కమిషనర్ ముని కుమార్**



**పులివెందుల సూర్య వాస్తవం:** పులివెందుల నారాయణ స్కూల్ నందు "స్వచ్ఛ సర్వేక్షన్" ప్రోగ్రాంలో భాగంగా మరియు బ్యాన్ ఆఫ్ సింగిల్ ప్లాస్టిక్ యూసెజ్ పై ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమానికి పులివెందుల కమిషనర్ ముని కుమార్" హాజరయ్యారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్లాస్టిక్ ప్రధాన సమస్యగా మారిందని భవిష్యత్తులో మరింత ప్రమాదంగా మారక ముందే ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించిన్నట్లయితే దానిని అరికట్టడం పెద్ద సమస్య కాదని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జ్యూట్, బ్యాగులు, గుడ్డ సంచులు,పేపర్ సంచులు విధిగా వాడాలని, బయటికి వెళ్ళేటప్పుడు వీటిని తీసుకెళ్లాలని సూచించారు . నాసిరకం ప్లాస్టిక్ అమ్మే దుకాణదారులకు, వ్యాపారస్తులకు ఫైన్లు వేస్తున్నామని ఇంకా పూర్తిగా అరికట్టే దిశగా అడుగులు వేస్తున్నామని అందులో భాగంగా ప్రతి దుకాణదారులకు చెత్త బయట పడవెయ్య కుండా, నిషేధిత ప్లాస్టిక్ అమ్మకుండా నోటీసులు కూడా జారీ చేస్తున్నామని తెలిపారు. పిల్లలకి సులువుగా అర్థమయ్యేందుకు అక్కడ ఏర్పాటు చేసిన మోడల్ ను చూపిస్తూ ఆయన చక్కగా వివరించారు. పగిలిపోయిన కుండలను పడవేయకుండ చెట్టుకు ప్రాణం పొసేవిగా తయారు చేయొచ్చని, పిల్లలు తీరిక సమయాలలో చెట్లను నాటే అలవాట్లను పెంపొందించుకోవాలని తెలిపారు. ఇంట్లో కుళ్ళిపోయిన కూరగాయలు, పండ్లు , టీ పౌడర్, గుడ్ల పెంకులు వాటిని సేంద్రియ ఎరువుగా మార్చి చెట్లకు వేచినట్లయితే చెత్త సమస్యగా మారదని చెత్తను వినియోగించుకోవడం నేర్చుకోవాలని తెలిపారు. అనంతరం మేనేజర్ "సతీష్ కమలాకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కోటింగ్ కలిగిన ప్లేట్లలో భోజనం చేయడం శ్రేయస్కరం కాదని అరిటాకులు గానీ, ఆకులతో చేసిన ప్లేట్లు వినియోగించాలని తెలిపారు. అనంతరం పాఠశాల ఏ జి ఎమ్ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నాసిరకం కవర్లలో కట్టి ఇచ్చినటువంటి వేడి,వేడి "టీ" గాని,ఆహార పదార్థాలు తినడం ఆరోగ్యానికి మంచిది కాదని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ హరిత రెడ్డి మాట్లాడుతూ పిల్లలు చదువుతోపాటు సమాజానికి హానిని కలిగించే వాటిని అరికట్టడంలో పిల్లల బాధ్యత మరువలేనిదని తెలియజేశారు. అనంత కమీషనర్ వినూత్నంగా విద్యార్థులతో మాట్లాడించే ప్రయత్నం చేశారు. చక్కగా మాట్లాడిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో నగర ఇంచార్జి "శానిటరీ ఇన్స్పెక్టర్" నటరాజ్, శానిటేషన్ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని

# జనసేన నాయకుల ప్రత్యేక పూజలు



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** స్థానిక జనసేన మండల అధ్యక్షులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు తమ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతపురం జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెన్నా అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం నందు జనసేన ఉరవకొండ మండల అధ్యక్షులు ఆగస్త్య చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఇటీవల జరిగిన శస్త్రచికిత్స అనంతరం త్వరగా కోలుకోవాలని, పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాలుపంచుకోవాలని కోరుతూ ఈ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ నాయకుడు కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, కోట్ల మందికి ఒక ఆశ, ధైర్యం మరియు మార్గదర్శి అని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.? శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆశీస్సులతో పవన్ కళ్యాణ్ మరింత శక్తితో, ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టాలని జనసేన నాయకులు అకాక్షించారు. అనంతరం జనసేన నాయకులు, కూటమి నాయకులు కలిసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అదే సమయంలో త్వరలో జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆలయ ఈవో సాకే రమేష్ బాబుతో కలిసి జనసేన నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బోయ దేవేంద్ర, ఇంద్రావతి సుధాకర్, ముష్టూరు రామకృష్ణ మరియు జనసేన పార్టీ నాయకులు రాజేష్, రమేష్, మల్లికార్జున, భార్గవ్, భోగేష్ తదితరులు పాల్గొన్నారు.




# పాఠశాల అదనపు గదుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కందికుంట



**కదిరి - సూర్య వాస్తవం:** పట్టణంలోని ప్రభుత్వ బాలికల హై స్కూల్ మరియు మున్సిపల్ పాఠశాల ఉర్దూ మీడియం లోని అదనపు గదులను మంగళవారం కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి శిలాఫలకాన్ని ప్రారంభం ఘనంగా ప్రారంభిం చారు, అనంతరం ఆయన మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన రెండు సంవత్సరాల కే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరే విధంగా రాష్ట్ర ప్రభుత్వం డబుల్ ఇంజన్ తీరుతో అభివృద్ధిపై పరుగులు తీస్తుందని పేర్కొన్నారు, అందులో భాగంగా కదిరి నియోజకవర్గం లో బాలికల ఉన్నత పాఠశాలలో పది లక్షల రూపాయల వ్యయంతో, మరియు మునిసిపల్ ఉర్దూ పాఠశాలలో 45 లక్షల రూపాయల వ్యయంతో అదనప గదులు నిర్మాణానికి కృషిచేసిన ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు, ఉర్దూ పాఠశాలల్లో ఉర్దూ కేవలం భాషా పరిజ్ఞానానికే పరిమితి కాదని ఉర్దూ భాష ద్వారా ఎందరో విద్యార్థిని విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు, పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలను కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు , పాఠశాలలో ఇంటిలోని వసతుల కన్నా మరిన్ని సౌకర్యాలను, భోజన సౌకర్యాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, తెలుగుదేశం పార్టీ నాయకులు కేఎస్ బహవుద్దీన్, మహిళా నాయకురాలు, రాష్ట్ర స్వచ్ఛభారత్ కార్పొరేషన్ సభ్యురాలు పర్వీన్ భాను, జనసేన పార్టీ నాయకులు గవ్వల శ్రీనివాసులు, అలియాస్ బెంగళూరు శీనా, బిజెపి నాయకులు తలుపుల గంగాధర్, కృష్ణ మోహన్ నాయుడు, ఎంఈఓ చెన్న కృష్ణ , యుటిఎఫ్ జిల్లా నాయకులు, శ్రీనివాసులు ,తాజా మాజీ కౌన్సిలర్లు రంగారెడ్డి , ఆల్ఫా ముస్తఫా, ఉట్టి ఓం , తజ్ముల్ , మోపిశెట్టి చంద్రశేఖ ర్, మహిళా నాయకురాలు పీట్ల రమణమ్మ, గంగ రత్న, ఉమాదేవి, బిజెపి నాయకురా లు కృష్ణవేణి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# 'కాక్ టెయిల్ 2'లో
# కృతి సనన్ స్టన్నింగ్ లుక్!



బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. షాహిద్ కపూర్ హీరోగా వస్తున్న 'కాక్ టెయిల్ 2' సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆమె షేర్ చేసిన గ్లామరస్ ఫోటోలు ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారాయి. కలర్‌ఫుల్ బోహేమియన్ డ్రెస్‌లో కృతి మెరిసిపోతుంటే, అభిమానులు ఫిదా అవుతున్నారు. తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమైన ఈ భామ, ఈసారి ఒక క్రేజీ రోల్‌తో థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.ఆ విశేషాలు చూద్దాం..అదిరిపోయే బోహేమియన్ లుక్: కృతి సనన్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఫోటోలు చూస్తుంటే కళ్లు తిప్పుకోవడం కష్టమే. గ్రీన్, ఆరెంజ్, మస్టర్డ్ ఎల్లో కలర్లతో కూడిన బోహేమియన్ స్టైల్ ప్రింటెడ్ డ్రెస్‌లో ఆమె చాలా స్టైలిష్‌గా కనిపిస్తోంది. దీనికి తోడు గోల్డ్ నెక్లెస్‌లు, బ్రాస్‌లెట్‌లు ధరించి ఒక వెరైటీ లుక్‌ను సెట్ చేసింది. ఈ సినిమాలో ఆమె 'ఆలీ' అనే పాత్రను పోషిస్తోంది. ఇక పాత్రకు తగ్గట్టుగానే ఆమె అవుట్‌ఫిట్ చాలా ఫ్రెష్‌గా, మోడ్రన్ రిలేషన్‌షిప్ డ్రామాను ప్రతిబింబించేలా ఉంది. ఈ ఫోటోలు పోస్ట్ చేసిన క్షణాల్లోనే వైరల్ అయ్యాయి. ౘాశ్రీంశీ  తెలుగు ప్రేక్షకులతో కృతికి ఉన్న అనుబంధం: కృతి సనన్ కేవలం హిందీ హీరోయిన్ మాత్రమే కాదు, తెలుగు వారికి కూడా చాలా ఇష్టమైన నటి. సూపర్ స్టార్ మహేష్ బాబు సరసన వన్ నేనొక్కడినే సినిమాతో వెండితెరకు పరిచయమై, ఆ తర్వాత నాగ చైతన్యతో దోచేయ్ సినిమాలో నటించి మెప్పించింది. ఇప్పుడు చాలా కాలం తర్వాత కాక్ టెయిల్ 2 సినిమాతో మన ముందుకు వస్తోంది. ఆమె అందం, అభినయం టాలీవుడ్ ఆడియెన్స్‌కు కూడా బాగా తెలుసు కాబట్టి, ఈ సినిమా కోసం ఇక్కడి ప్రేక్షకులు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రష్మిక మందన్న కూడా.. భారీ క్రేజ్: కాక్ టెయిల్ 2 సినిమాలో మరో విశేషం ఏమిటంటే.. ఇందులో కృతి సనన్‌తో పాటు నేషనల్ క్రష్ రష్మిక మందన్నా కూడా మరో హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చే ఒక సాంగ్ ఇప్పటికే సోషల్ మీడియాలో భారీ వ్యూస్‌తో దూసుకుపోతోంది. ఇక ఇద్దరు స్టార్ హీరోయిన్లు ఒకే స్క్రీన్‌పై కనిపించబోతుండటం ఈ సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్. షాహిద్ కపూర్ హీరోగా, ఈ ఇద్దరు భామల గ్లామర్ తోడైతే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురవడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. జూన్ 19న థియేటర్లలో రచ్చ: 2012లో వచ్చిన సూపర్ హిట్ 'కాక్ టెయిల్ ' కు ఇది ఒక స్పిరిచువల్ సీక్వెల్. పూర్తిగా కొత్త కథతో, ఆధునిక సంబంధాల నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించారు.ఇక ఈ ఏడాది జూన్ 19న ఈ రొమాంటిక్ కామెడీ డ్రామా థియేటర్లలో విడుదల కానుంది. కృతి సనన్ షేర్ చేసిన గ్లామరస్ ఫోటోలు సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. ఈ వేసవిలో కాక్ టైల్ 2 బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి. మరి కృతి సనన్ 'ఆలీ'గా ఏ రేంజ్ లో అలరిస్తుందో తెలియాలంటే జూన్ 19 వరకు ఆగాల్సిందే!

## మోస్ట్ పాపులర్
## హీరో డార్లింగ్, హీరోయిన్ సామ్



భారతీయ సినీ పరిశ్రమలో స్టార్‌డమ్‌కు కొత్త ప్రమాణాలను నిర్ధారించే రీతిలో ఆర్మాక్స్ మీడియా రిలీజ్ చేసిన తాజా లిస్ట్ చర్చనీయాంశంగా మారింది. మార్చి నెలకు సంబంధించిన మోస్ట్ పాపులర్ ఇండియన్ ఫిల్మ్ స్టార్స్ ర్యాంకింగ్స్‌లో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అగ్రస్థానాన్ని దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. అతని తర్వాతి స్థానాల్లో అల్లు అర్జున్, విజయ్, షారుఖ్ ఖాన్, మహేష్ బాబు వరుసగా నిలిచారు. ఈ లిస్ట్ సోషల్ మీడియా ట్రెండ్స్, ఆడియన్స్ ఎంగేజ్‌మెంట్, పాపులారిటీ ఇండెక్స్.. పలు ప్రమాణాల ఆధారంగా రూపొందించబడటం గమనార్హం. ముఖ్యంగా టాలీవుడ్ హీరోలు ఈ లిస్టులో ఆధిపత్యం ప్రదర్శించడం ఇండస్ట్రీ ప్రభావాన్ని మరోసారి రుజువు చేస్తోంది. ఇక హీరోయిన్ల విభాగంలో సమంత రూత్ ప్రభు తొలి స్థానాన్ని దక్కించుకోవడం ఆమె కొనసాగుతున్న క్రేజ్‌కు నిదర్శనంగా నిలిచింది. ఆమె తర్వాత ఆలియా భట్, రష్మిక మందన్నా, దీపికా పదుకొణె, కాజల్ అగర్వాల్ స్థానాలను సంపాదించుకున్నారు. సౌత్ హీరోయిన్లు కూడా ఈ జాబితాలో గట్టి ప్రాధాన్యం సంపాదించడం విశేషం. ముఖ్యంగా సాయి పల్లవి, నయనతార, త్రిష కృష్ణన్ లాంటి హీరోయిన్లు తమ స్థిరమైన ఫ్యాన్ బేస్‌తో టాప్ 10లో నిలిచారు. ౘాశ్రీంశీ =ఝు౦ - టాలీవుడ్ లో ఎంత మంది డాక్టర్ హీరోయిన్లు అంటే? ఈ ర్యాంకింగ్స్‌ను పరిశీలిస్తే ప్రాంతీయ సరిహద్దులు ఇకపై పెద్దగా ప్రభావం చూపడం లేదన్న విషయం స్పష్ట మవుతోంది. పాన్ ఇండియా కాన్సెప్ట్ బలపడడంతో భాషకు అతీతంగా స్టార్‌లకు అభిమాన వర్గం విస్తరిస్తోంది. రామ్ చరణ్, జూ. ఎన్టీఆర్ లాంటి టాలీవుడ్ హీరోలు నార్త్ ఇండియన్ ఆడియన్స్ లో కూడా మంచి గుర్తింపు తెచ్చుకోవడం దీనికి ఉదాహరణ. అదే సమయంలో సల్మాన్ ఖాన్, రణ్‌వీర్ సింగ్, అక్షయ్ కుమార్ లాంటి బాలీవుడ్ స్టార్‌లు కూడా తమ స్థిర స్థానం కొనసాగించడం గమనించదగిన అంశం. మొత్తంగా చూస్తే, ఈ నెల ర్యాంకింగ్స్‌లో టాలీవుడ్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు, భారీ స్థాయి నిర్మాణాలు, గ్లోబల్ రీచ్ వంటి అంశాలు తెలుగు సినీ పరిశ్రమను దేశవ్యాప్తంగా ముందంజలో నిలిపాయి. ఈ నేపథ్యంలో ప్రభాస్, సమంత లాంటి స్టార్లు నంబర్ వన్ స్థానాల్లో నిలవడం కేవలం వ్యక్తిగత విజయమే కాకుండా టాలీవుడ్ ఎదుగుదలకు ప్రతీకగా నిలుస్తోంది. ముందున్న నెలల్లో ఈ ర్యాంకింగ్స్‌లో మార్పులు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.



# సొంతగడ్డపై సన్ రైజర్స్ హ్యాట్రిక్...
# ఢిల్లీపై అద్భుత విజయం

- హైదరాబాద్‌లో పరుగుల వరద.. ఢిల్లీపై 47 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ విజయం
- విధ్వంసకర సెంచరీతో అదరగొట్టిన ఓపెనర్ అభిషేక్ శర్మ
- బౌలింగ్‌లో మలింగ, హర్ష్ దూబె మాయ
- ఈ విజయంతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరిన ఎస్ఆర్‌హెచ్



ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. సొంత మైదానం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఆరెంజ్ ఆర్మీ పరుగుల సునామీ సృష్టించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ అజేయ, విధ్వంసకర శతకంతో కదం తొక్కడంతో, ఢిల్లీ క్యాపిటల్స్‌పై 47 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ ఘన విజయం సాధించింది. సొంతగడ్డపై సన్‌రైజర్స్ కు ఇది వరుసగా మూడో విజయం. ఈ విజయంతో ప్లేఆఫ్స్ దిశగా మరో అడుగు వేయడమే కాకుండా, పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ఫీల్డింగ్ ఎంచుకోగా, హైదరాబాద్ బ్యాటింగ్ ప్రదర్శన విధ్వంసక రీతిలో సాగింది. ఓపెనర్ అభిషేక్ శర్మ ప్రత్యర్థి బౌలింగ్ ను ఊచకోత కోశాడు. కేవలం 68 బంతుల్లో 10 ఫోర్లు, 10 భారీ సిక్సర్లతో 135 పరుగులు చేసి ఆఖరి వరకు అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో ఢిల్లీ బౌలర్లకు చుక్కలు కనిపించాయి. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (37), ఇషాన్ కిషన్ (25) వేగంగా ఆడగా, చివరిలో హెన్రిచ్ క్లాసెన్ (13 బంతుల్లో 37) తనదైన శైలిలో మెరుపులు మెరిపించాడు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 2 వికెట్ల నష్టానికి 242 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.

భారీ లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ పోరాడినప్పటికీ, క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో లక్ష్యానికి దూరంగా నిలిచిపోయింది. నితీశ్ రాణా (30 బంతుల్లో 57), సమీర్ రిజ్వీ (41), కేఎల్ రాహుల్ (37) రాణించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముఖ్యంగా సన్‌రైజర్స్ బౌలర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. యువ పేసర్ ఎషాన్ మలింగ తన పదునైన బౌలింగ్‌తో ఢిల్లీ పతనాన్ని శాసించాడు. కీలకమైన డేవిడ్ మిల్లర్ (0), ట్రిస్టన్ స్టబ్స్ (27) సహా మొత్తం 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డి విరిచాడు.

మరోవైపు, యువ స్పిన్నర్ హర్ష్ దూబే తన మాయాజాలంతో ఆకట్టుకున్నాడు. కేవలం 2 ఓవర్లు బౌలింగ్ చేసి 12 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీసి ఢిల్లీ ఓటమిని ఖాయం చేశాడు. దీంతో ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 195 పరుగులకే పరిమితమైంది.

ఈ గెలుపుతో సన్‌రైజర్స్ 7 మ్యాచ్‌లలో 4 విజయాలు, 8 పాయింట్లతో పట్టికలో మూడో స్థానానికి చేరింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సమష్టిగా రాణించడం ఆరెంజ్ ఆర్మీ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

## చెన్నై సూపర్ కింగ్‌కు ఎదురుదెబ్బ

**- గాయంతో 2026 ఐపిఎల్ నుంచి వైదొలిగిన ఆయుష్ మాత్రే**



**చెన్నై:** 2026 సీజన్‌లో పేలవఫామ్‌లో ఉన్న చెన్నై సూపర్‌కింగ్స్(సిఎస్‌కె)కు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నిలకడగా రాణిస్తున్న ఏకైక ఆటగాడు ఆయుశ్ మాత్రే గాయం కారణంగా ఈ టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. ఇందుకు సంబంధించి సీఎస్‌కే మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఏప్రిల్ 18 నాటి మ్యాచ్ సందర్భంగా ఆయుశ్ మాత్రే తొడ కండరాలు పట్టేశాయి. ఆయుశ్ గాయం నుంచి కోలుకోవడానికి సుమారు 6-12 వారాల సమయం పడుతుంది. కాబట్టి ఐపీఎల్-2026లో మిగిలిన సిఎస్‌కె మ్యాచ్‌లన్నింటికీ అతడు దూరమయ్యాడు అని తెలిపింది. ఈ సీజన్‌లో ఆయుశ్ మాత్రే.. ఆరు మ్యాచుల్లో 201 పరుగులు చేసాడు. ఆయుశ్ స్థానంలో ఉర్విల్ పటేల్, కార్తిక్ శర్మను తుదిజట్టులో ఆడించే అవకాశం ఉంది. ఎంఎస్ ధోని ఫిట్‌నెస్ సమస్యతో ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఖలీల్ అహ్మద్ కూడా జట్టుకు దూరమయ్యాడు. చెన్నై ఆరు మ్యాచుల్లో రెండింట్లో గెలిచి నాలుగు మ్యాచుల్లో ఓడింది.

## అల్కరాజ్, సబలెంకకు అవార్డులు



**న్యూయార్క్:** బెలారస్ స్టార్ అర్యానా సబలెంక, స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కరాజ్‌లకు 2025 ఏడాదిలో టెన్నిస్ విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చినందుకు అవార్డులు దక్కాయి. వీరిద్దరూ పురుషుల, మహిళల విభాగాల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. మాడ్రిడ్‌లో జరిగిన లారియస్ అవార్డుల వేడుకలో అల్కరాజ్, సబలెంక 2025 ఏడాది ఉత్తమ ఆటగాళ్లుగా కిరీటాన్ని అందుకున్నారు. టెన్నిస్ జగత్తుపై గత ఏడాది వీరిద్దరి హవా చెలాయించారు. 22ఏళ్ల స్పెయిన్‌కు చెందిన అల్కరాజ్.. ఎటిపి ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంతో పాటు గత ఏడాది ఫ్రెంచ్, యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను కైవసం చేసుకున్నాడు. ఇక బెలారస్‌కు చెందిన 27ఏళ్ల సబలెంకా గత ఏడాది న్యూయార్క్ ఓపెన్‌తోపాటు ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌కు చేరి రన్నరప్‌తో సరిపుచ్చుకుంది.

# జిల్లా వ్యాప్తంగా
# శక్తి టీంల అవగాహన సదస్సులు




**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా కళ్యాణదుర్గం, అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్, గుంతకల్లు , తాడిపత్రి సబ్ డివిజన్ల పరిధుల్లో శక్తి టీం లు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయా సబ్ డివిజన్ల పరిధుల్లోని గ్రామాలు, విద్యా సంస్థలకు వెళ్లి వివిధ అంశాలపై అవగాహన చేశారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, టీ కేఫ్ లు, పార్కులు, తదితర ప్రాంతాలకు వెళ్లి శక్తి యాప్ డౌన్లోడ్ చేయించడ , సైబర్ నేరాల బారిన పడకుండా ముందు జాగ్రత్తలు, అప్రమత్తతతో ఎలా సైబర్ నేరాలను దూరం చేయవచ్చో వివరించారు. శక్తి యాప్ డౌన్లోడ్, యాప్ యొక్క ఉపయోగాలు తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు. డైల్ 100/112, 1098,181 నంబర్ల ఉపయోగాలు తెలిజేశారు. ఫేక్ ఫోన్ కాల్స్ ,బ్యాంకుల నుండి ఫోన్ కాల్స్, ఓటీపీ గురించి అవగాహన చేశారు. సైబర్ నేరాలు ,ఎటిఎం మోసాల గురించి అవగాహన కల్పించారు.





- ఘటనపై స్పందించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్.జవహర్.
- డీఎస్పీ స్థాయి అధికారిచే విచారణకు జిల్లా ఎస్పీ ఆదేశాలు

# పెద్దవడుగురు ఎస్ఐ ఆంజనేయులుపై
# తక్షణ చర్యలకు ఆదేశం..!

**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా పెద్దవడుగూరు ఎస్సై ఒక దళిత యువకుడిపై విచక్షణా రహితంగా దాడిచేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే.....సదరు ఎస్సైపై తీవ్రస్థాయిలో విమర్శలు వెలువెత్తుతున్న నేపథ్యంలో ఈ ఘటనపై స్పందించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్.జవహర్.వాస్తవాలను వారం రోజుల్లో విచారణ చేసి బాధ్యులకు న్యాయం చేయాలని అధికారులకు ఆదేశం జారీ చేశారు ..దాడులు వాస్తవం అయితే సహించేది లేదని తేల్చి చెప్పారు .. బాధ్యులపై ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ అనంతపురం జిల్లాలో పర్యటన సమయంలో దళిత యువకుడుపై దాడి జరగడం దారుణం.లా అండ్ ఆర్డర్ ను పరిరక్షించే పోలీసులు నిల దాడి చేయడం సరికాదన్నారు.





దళితుల పట్ల మానవీయ కోణం అవసరం.ఈ ఘటనపై తక్షణ చర్యలకు ఆయన ఆదేశించారు. ఇదిలా ఉండగా ఈ ఘటనకు సంబంధించి జిల్లా ఎస్పీ పి జగదీష్ సీరియస్ అయ్యారు..చట్టపరమైన చర్యలకు సిద్ధమైనట్టు తెలుస్తుంది.ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్ స్పందించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంపై అత్యంత సీరియస్‌గా తీసుకున్నారు. ఈ ఘటనపై వెంటనే డీఎస్పీ స్థాయి అధికారితో విచారణ జరిపించి పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. విచారణ నివేదిక అందిన తర్వాత బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.



## బాలసదనం సూపరింటెండెంట్ రఫీ మున్నీసాను అభినందించిన ఐసీడీపీ పీడీ శశికళ

**అనంతపురం– సూర్య వాస్తవం:** ఆధునికీకరణ అనంతరం బలసదనం చాలా చక్కగా ఉంది. మంచి విశాలమైన గదులు తయారయ్యాయి. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంది. ఇక్కడ చేరే పిల్లలను సొంత బిడ్డల్లా చూసుకుంటున్నారు అంటూ ఐసీడీఎస్ అనంతపురం పీడీ శశికళ కితాబునిచ్చారు. పీడీగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన శశికళ మంగళవారం ఉదయం బుడ్డప్ప నగర్ లోని బాలసదనం సందర్శించారు. బాలసదనం లో ఎంతమంది పిల్లలు ఉన్నారు, ఎవరెవరు ఏమేం తరగతులు చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. బాలసదనంలో వాతావరణం బాగుందని, తల్లిదండ్రి లేని పిల్లలను బాలసదనంలో చేర్చేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. సూపరింటెండెంట్ ఖాజీ రఫీమున్నీసా, సిబ్బందిని అభినందించారు.

## పాత, మోతలతో వైసీపీ నేతలు



**శ్రీకాకుళం– సూర్య వాస్తవం:** సాధారణంగా రాజకీయాల్లో విమర్శలు కామన్. అయితే గతం మాదిరిగా సిద్ధాంతపరంగా పార్టీలో కొనసాగే వారు తక్కువ. కానీ ఒక పార్టీలో కొనసాగాలంటే ప్రత్యర్థి పార్టీ నేతపై తీవ్రస్థాయిలో విమర్శలు చేయాలి.

అటువంటి పరిస్థితి నేటి రాజకీయాల్లో కొనసాగుతోంది. అయితే ఇప్పుడు అదే నేతలకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. తాజాగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోని ఇద్దరు మాజీ మంత్రులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. గతంలో వారు కాంగ్రెస్ పార్టీలో కొనసాగినప్పుడు జగన్మోహన్ రెడ్డి పై చాలా కామెంట్లు చేశారు. ఆయన పై వ్యక్తిగత విమర్శలు కూడా చేశారు. ఇప్పుడు ఆ విమర్శలను గుర్తు చేస్తూ టిడిపి కూటమి జగన్మోహన్ రెడ్డిని ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. అయితే జగన్మోహన్ రెడ్డికి మించి ఓ ఇద్దరు మాజీ మంత్రులు చాలా బాధపడుతున్నారు. వారే బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ సమయంలో జగన్మోహన్ రెడ్డి పై ధర్మాన తో పాటు బొత్స చాలా వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీని విభేదించి వైసీపీ ఏర్పాటు చేసుకున్నారు జగన్. ఆ సమయంలో చాలామంది నేతలు జగన్ వెంట అడుగులు వేశారు. కానీ బొత్స తో పాటు ధర్మాన కాంగ్రెస్ పార్టీలో ఉండిపోయారు. ఎందుకంటే అప్పటికే ధర్మాన కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక మంత్రిగా వ్యవహరిస్తున్నారు. బొత్స సత్యనారాయణ అయితే పార్టీలో టాప్ 5 లో ఉండేవారు. పైగా ఉమ్మడి రాష్ట్రానికి పిసిసి అధ్యక్షుడిగా కూడా ఉండేవారు. అయితే ఈ ఇద్దరు నేతలు జగన్మోహన్ రెడ్డి పై చెయ్యని వ్యాఖ్యలు అంటూ లేవు. ఆయన వ్యాపారాలపై మాట్లాడారు. నేర ప్రవృత్తి పై వ్యాఖ్యలు చేశారు. దాదాపు వైసీపీ ఆవిర్భావం నుంచి 2014 ఎన్నికల వరకు ఈ ఇద్దరు నేతలు చేయని వ్యాఖ్యలు అంటూ లేవు.జగన్మోహన్ రెడ్డి వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టిడిపి రంగంలోకి దిగింది. మేం చెప్పే కంటే.. వైసీపీలో ఉన్న బొత్స, ధర్మానలు చెప్పినవి ఇవి అంటూ పాత మీడియా క్లిప్పింగులు తీసి మరి చూపిస్తున్నారు టిడిపి నేతలు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాత క్లిప్పింగులు తీసి వీరి విమర్శలను మీడియా ముందు ప్రదర్శించారు. అయితే ఇక్కడ తెలుగుదేశం పార్టీకి ఒక లక్ష్యం ఉన్నట్టు కనిపిస్తోంది. జగన్ వైఖరి గురించి సొంత పార్టీ వారి అభిప్రాయం చెప్పించే ప్రయత్నం ఒకటి కాగా.. తద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై జగన్ అనుమానపు చూపులు చూసేలా చేయాలన్నది ప్రణాళికగా కనిపిస్తోంది. ఇలా ఎలా చూసుకున్నా ఇప్పుడు జగన్ కంటే ధర్మాన, బొత్స ఇరకాటంలో పడుతున్నారు. ఒకవేళ జగన్మోహన్ రెడ్డి దీనిని వ్యక్తిగతంగా తీసుకుంటే మాత్రం తమ పొలిటికల్ లైఫ్ క్లోజ్ అవుతుందని భయపడిపోతున్నారు. అనుచరుల వద్ద ఇదే మాటలు చెప్పి వణికిపోతున్నారు.

## తిరుమల కైంకర్య వ్యవస్థకు రామానుజాచార్యుల సేవలు విశిష్టం

- ఉభయ వేదాంత విద్వాంసులు శ్రీ నరసింహన్

**తిరుమల–సూర్య వాస్తవం:**

తిరుమలలో శ్రీ రామానుజాచార్యులు ఏర్పాటు చేసిన కైంకర్య విధానాలు నేటికీ కొనసాగుతున్నాయని శ్రీ నరసింహన్ తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న అవతార మహోత్సవాల రెండవ రోజు ఆయన "రామానుజాచార్యులు– తిరుమల కైంకర్యము"పై ప్రసంగించారు. తిరుమల, శ్రీ గోవిందరాజస్వామి ఆలయం , ఇతర దివ్యదేశాల్లో ఆయన ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇప్పటికీ అమలులో ఉందన్నారు. బ్రహ్మోత్సవాలు, అభిషేకాలు, జీయర్ వ్యవస్థ వంటి సేవలను ప్రారంభించారని వివరించారు.అనంతరం తిరుపతికి చెందిన శ్రీ చంద్రశేఖర్ భగవాతార్ హరికథ గాన కార్యక్రమంలో ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీ పురుషోత్తం, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )